శుక్రవారం
28-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 305
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

విశాలాంధ్ర

స్థాపితం : 1952

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

చైనా ఎప్పుడు శాంతిపక్షమే

చర్చలు, సంప్రదింపులతోనే ఉక్రెయిన్ సంక్షోభానికి పరిష్కారం సాధ్యమని, ఇందుకు అదొక్కటే మార్గమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. అణు యుద్ధంలో ఎవరికీ విజయం లభించదని అన్నారు. అంతర్జాతీయంగా తీవ్ర పరిస్థితులకు ఉక్రెయిన్ సంక్షోభం దారితీస్తోందని అన్నారు.

2లో

కొండెక్కిన పప్పు ధరలు

- నియంత్రణలో మోదీ సర్కారు విఫలం
- దిగుమతిపైనే ఆధారం

న్యూఢిల్లీ: భారతదేశంలో పప్పు ధాన్యాల వినియోగం ఎక్కువే. అధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశం కూడా మనదే. పప్పుధాన్యాలు, వంట నూనెలను భారత్ భారీగా దిగుమతి చేసుకుంటుంది. ఉత్పత్తి తక్కువగా ఉండటంతో 2021-22 పంటకాలంలో పప్పుల దిగుమతులు 9.44 శాతం పెరిగి 27 లక్షల టన్నులకు చేరాయి. 2020-21లో 24.66 లక్షల టన్నుల పప్పుధాన్యాలను భారత్ దిగుమతి చేసుకుంది. పెసలు, మినుములు, ఎర్ర కందులకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో వాటి ధరలు 30 శాతం పెరిగాయి. దేశంలో అధికంగా వినియోగించే కందిపప్పు ధర కిలో రూ.185 పలుకుతోంది. కిలో పెసరపప్పు రూ.249, మినపప్పు రూ.115, ఎర్ర కందిపప్పు రూ.160 ఉంది. ఇంత జరుగుతున్నా మోదీ ప్రభుత్వం చోద్యం చూస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశంలో పప్పు ధాన్యాల వినియోగం అధికంగా ఉన్నప్పటికీ ఇతర పంటలతో పోలిస్తే పప్పు ధాన్యపు పంటల ఉత్పత్తి పెరగడం లేదు. అందువల్ల పప్పుధాన్యాలు, వంట నూనెలను అంతర్జాతీయ మార్కెట్ల నుండి పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోంది. సరైన విధానపర చర్యలు చేపడితే వీటిని దేశీయంగానే సులభంగా ఉత్పత్తి చేడానికి వీలవుతుంది. ఈ ఏడాది మార్చి 23 నాటికి భారత్ 8.75 లక్షల టన్నుల బఠాణీలను, 5.12 లక్షల టన్నుల మినుములను దిగుమతి చేసుకుంది. 2022-23లో కందుల ఉత్పత్తి 9.8 శాతం, మినుముల ఉత్పత్తి 12 శాతం తగ్గిపోయింది. బీహార్‌లో కందుల ధర 89 శాతం పెరిగింది. ఈ నెలలో క్వింటాలు ధర రూ.14,500 చేరింది. గతేడాది ఇదే నెలలో దీని ధర రూ.7,681 మాత్రమే. లాభదాయక

- మిగతా 2 లో

వివేకా కేసులో
సీబీఐ దూకుడు

- పీఏ కృష్ణారెడ్డి భార్య, కుమారుడ్ని విచారించిన అధికారులు
- ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు
- ఎంపీ అవినాశ్ ముందస్తు బెయిల్‌పై మళ్లీ విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో సీబీఐ దూకుడు పెంచింది. ఈ కేసుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధమున్న ఏ వ్యక్తినీ వదలడం లేదు. అనుమానితులుగా ఉన్న వారిని, ఈ కేసుపై అవగాహన ఉన్నవారినీ విచారిస్తున్నారు. వివేకా కుమార్తె సునీతారెడ్డితోపాటు, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డి వాంగ్మూలాలతోపాటు, నిందితుడు ఉదయ్‌కుమార్ రెడ్డితో కర్మాగారంలో పనిచేసే నలుగురిని హైదరాబాద్ కోఠి సెంటర్‌లోని సీబీఐ కార్యాలయానికి పిలిపించి మరీ విచారించింది. వివేకా హత్య జరిగిన రోజు తెల్లవారుజామునే ఘటనాస్థలికి వెళ్లిన ఇనయతుల్లాను సీబీఐ అధికారులు దాదాపు నాలుగు గంటలపాటు విచారించారు. వివేకానందరెడ్డి వద్ద ఇనయతుల్లా సుదీర్ఘకాలం కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేశారు. విధి నిర్వహణలో భాగంగా నిత్యం తెల్లవారుజామునే వివేకా ఇంటికి వెళ్లే ఇనయతుల్లా, హత్య జరిగిన రోజు కూడా యథావిధిగానే వెళ్లారు. అప్పటికే వివేకా హత్య జరిగినట్లు తెలియడంతో మృతదేహం ఫొటోలను వాట్సప్ ద్వారా వివేకా కుటుంబసభ్యులకు పంపారు. ఈ విషయాలన్నీ మరోసారి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అలాగే కడప జిల్లా తుమ్మలపల్లి యురేనియం కర్మాగారం మెకానికల్ విభాగం మేనేజర్లు టి.చంద్రశేఖర్ రెడ్డి, వెంకటరాజేష్, రాజులను కూడా విచారించారు. గురువారం వివేకా పీఏ కృష్ణారెడ్డిని విచారించేందుకు పులివెందుల్లోని ఆయన ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన ఇంట్లో లేకపోవడంతో కృష్ణారెడ్డి భార్య సుజాత, కుమారుడు రాజేశ్‌ను అధికారులు విచారించారు. అలాగే ఇక మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దయింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం మే 5లోపు సీబీఐకి లొంగిపోవాలని ఎర్ర గంగిరెడ్డిని కోర్టు ఆదేశించింది. లొంగని పక్షంలో ఆయన్ను అదుపులోకి తీసుకోవాలని సీబీఐకి సూచించింది. వివేకానందరెడ్డి హత్య కేసులో తనను సీబీఐ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై ఇవాళ ఎట్టకేలకు తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. ఇప్పటికే గతవారం ఇదే పిటిషన్ పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని సుప్రీంకోర్టు తప్పుబట్టిన నేపథ్యంలో తిరిగి విచారణ చేపట్టేందుకు మూడు రోజులు తీసుకున్న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇవాళ వాదనలు ప్రారంభించేందుకు అనుమతించింది. దీంతో అవినాష్ తరఫున నిరంజన్ రెడ్డి, సునీత తరఫున సుప్రీం న్యాయవాది సిద్ధార్థ లూత్రా, సీబీఐ తరఫున పీపీ నాగేంద్ర వాదించారు. ముందుగా వాదనలు ప్రారంభించిన అవినాష్ రెడ్డి లాయర్ నిరంజన్ రెడ్డి.. సీబీఐ తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ముఖ్యంగా గూగుల్ టేకౌట్ ద్వారా సీబీఐ అవినాశ్ రెడ్డిని నిందితుడిగా చూపించడాన్ని తప్పుబట్టారు. గూగుల్ టేకౌట్ కేవలం ఫోన్ ఎక్కడుండనేది మాత్రమే

- మిగతా 2 లో

కోడికత్తి కేసు మే 10కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కోడికత్తి కేసు విచారణ మే 10వ తేదీకి వాయిదా పడింది. నాటి ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డిపై దాడికి పాల్పడిన నిందితుడు శ్రీనివాస్‌ను రాజమండ్రి జైలు నుంచి వీడియో కాల్‌లో ఎన్ఐఏ కోర్టు గురువారం విచారించింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని గతంలో సీఎం జగన్ పిటిషన్ దాఖలు చేశారు. తాను కోర్టుకు రావాలంటే ట్రాఫిక్ సమస్యలు ఏర్పడతాయని, భారీగా ఖర్చవుతుందని, అందువల్ల అడ్వకేట్ కమిషనర్‌ను నియమించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. ప్రధానంగా సీఎం రెండు పిటిషన్లు దాఖలు చేశారు. తాను కోర్టుకు హాజరు కాలేననేది ఒక పిటిషన్... దానికి సంబంధించి అడ్వకేట్ కమిషనర్‌ను ఏర్పాటు చేసి విచారించాలని కోరారు. దీనిపై ఇప్పటికే నిందితుడి తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. అదే సమయంలో మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. ఎన్ఐఏ పూర్తి స్థాయిలో దీనికి సంబంధించి విచారణ జరపలేదని, పూర్తి స్థాయిలో మరొకసారి ఈ కేసుపై విచారణ చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ రెండు పిటిషన్లపై గురువారం విచారణ జరుగుతుందని అంతా భావించారు. అయితే ఈ కేసు విచారణ చేసిన న్యాయమూర్తి ప్రమోషన్‌పై కడప జిల్లా కోర్టుకు బదిలీ అయిన నేపథ్యంలో ఆ స్థానంలో వచ్చిన తాత్కాలిక న్యాయమూర్తి, పూర్తి స్థాయిలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత విచారిస్తానని పేర్కొంటూ కేసును మే 10వ తేదీకి వాయిదా వేశారు.

1 నుంచి వేసవి సెలవులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పాఠశాలలకు మే ఒకటోతేదీ నుంచి జూన్11 వరకు వేసవి సెలవులను ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. తిరిగి జూన్ 12న పాఠశాలలు తెరుచుకుంటాయని పేర్కొంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. వాటి ప్రతులను అన్ని పాఠశాలలు, ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖ, మున్సిపల్ పరిపాలనా అధికారులకు పంపారు. అన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఈ నిబంధనలను పాటించాలని ఆదేశించారు. వేసవి సెలవుల్లో తరగతులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలను అధికారులు హెచ్చరించారు.

మాయమాటలు చెప్పి
కిడ్నీ దోచేశారు

పెందుర్తిలో కలకలం రేపిన ఘటన

విశాలాంధ్ర-పెందుర్తి: విశాఖ జిల్లా పెందుర్తిలో కిడ్నీలు కొట్టేసే ముఠా వ్యవహారం కలకలం రేపింది. మాయమాటలు చెప్పి గోరుజల్ల వినయ్ కుమార్ అనే నిరుపేద యువకుడి కిడ్నీని లాగేశారు ముఠా సభ్యులు. విశాఖ పట్నం పీఎం పాలెం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న వినయ్‌కుమార్‌కు కామరాజు అనే వ్యక్తి మధురవాడలో పరిచయం అయ్యాడు. వినయ్‌కుమార్ ఆర్థిక ఇబ్బందుల గురించి తెలుసుకున్న కామరాజు... కిడ్నీఅమ్మితే ఎనిమిది లక్షలు రూపాయలు వస్తాయని నమ్మబలికాడు. కేజీహెచ్ డౌన్ లో ఉన్న

- మిగతా 2 లో

మోదీ విధానాలపై
మీ వైఖరేమిటి?

చంద్రబాబును ప్రశ్నించిన రామకృష్ణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజావ్యతిరేకత పెరిగిందని వ్యాఖ్య

విశాలాంధ్ర-విజయవాడ: మోదీ ప్రభుత్వ విధానాలపై స్పష్టమైన వైఖరిని వెల్లడించాలని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూటిగా ప్రశ్నించారు. ఓపక్క ప్రధాని మోదీ విధానాలతో దేశం వెనుకబడిపోతుంటే...మోదీ, అదానీ విజన్ అద్భుతమంటూ చంద్రబాబు ప్రశంసించడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. విజయవాడలో సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. తనదీ మోదీ విజన్ అని చెప్పడాన్ని రామకృష్ణ తప్పుబట్టారు. మోదీ సర్కారుపై టీడీపీ వైఖరిని ప్రజలకు స్పష్టం చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. మోదీ, జగన్ పరస్పర సహకారంతోనే కృష్ణపట్నం పోర్టు, రామాయపట్నం పోర్టు అదానీకి కట్టబెట్టారని తెలిపారు. అదానీ అక్రమ ఆస్తులపై విచారణ కోసం జేపీసీ వేయాలని ప్రతిపక్షాలన్నీ ముక్తకంఠంతో డిమాండ్ చేసినా మోదీ సర్కారు స్పందించలేదని, పైగా కేసులతో విపక్షాలను భయపెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో మాత్రం సీఎం జగన్ హడావుడిగా కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి...కోట్లాది రూపాయల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మేమేం తీసుకుంటామండీ,
నా బొంద మీ ఆస్తులు తప్ప!

కొత్త పీఆర్సీపై త్వరలో నిర్ణయం: బొత్స హామీ

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: సీపీఎస్‌కు చట్టబద్ధత లేదన్న అంశంపై ఎవరో మాట్లాడితే స్పందించలేనని మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాల నేతలతో అనధికార సమావేశం తర్వాత బొత్స గురువారం మీడియాతో మాట్లాడారు. సీపీఎస్ ఉద్యోగుల కంట్రిబ్యూషన్, డీఏ బకాయిలపై చర్చించామని మంత్రి చెప్పారు. ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలపై మే 1 నుంచి జీవోలు జారీ చేస్తామన్నారు. కొత్త పీఆర్సీ నియామకంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటా మని, కొన్ని ఉద్యోగ సంఘాలు సామరస్యంగా ప్రవర్తించాలని కోరారు. ప్రభుత్వానికి ఎవరిపైనా వివక్ష ఉండదని, ఉద్యోగులంతా తమ కుటుంబసభ్యులేనని బొత్స తెలిపారు.

రూ.1800 కోట్ల చెల్లించలేదు: బొప్పరాజు

ఉద్యోగులకు సంబంధించిన డబ్బు మాత్రమే ప్రభుత్వం చెల్లించిందని ఏపీ జేఏసీ అమరావతి

- మిగతా 2 లో

పోలీసులపైనా ఫిర్యాదు చేయొచ్చు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలీసులపై వచ్చే ఫిర్యాదులు స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు ఫిర్యాదుల సంస్థ పేరుతో కమిటీని ఏర్పాటు చేశారు. పదవీ విరమణ పొందిన ముగ్గురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అథారిటీ సభ్యులుగా ఉదయలక్ష్మి (రిటైర్డ్ ఐఏఎస్), కేవీబీ గోపాలరావు (రిటైర్డ్ ఐపీఎస్), బత్తిన శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ సభ్యులు...పోలీసులపై వచ్చే ఫిర్యాదులు నమోదు చేసి... పరిశీలిస్తారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు విశాఖపట్నం కేంద్రంగా, ఉమ్మడి కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలకు రాజమండ్రి కేంద్రంగా, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు గుంటూరు, రాయలసీమ జిల్లాలకు కర్నూలు కేంద్రంగా మరో కమిటీని ఏర్పాటు చేసింది. ప్రతి కేంద్రంలో ముగ్గురు పదవీ విరమణ చేసిన డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులను నియమించాలని నిర్ణయం తీసుకుంది.

మహిళల సాధికారతే లక్ష్యం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలపై సమీక్షలో సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మహిళల స్వయం సాధికారితే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత, ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం లాంటి వివిధ పథకాల ద్వారా వారికి జీవనోపాధి కల్పించే మార్గాలను మరింత విస్తృతం చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేయూత కింద అర్హత సాధించిన లబ్ధిదారులకు వరుసగా నాలుగేళ్లపాటు క్రమం తప్పకుండా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాల కింద కూడా నిర్ణయించిన వ్యవధి మేరకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల సహాయంతో స్వయం ఉపాధి మార్గాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని, దీన్ని మరింత విస్తృతం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. అర్హులైన మహిళల్లో మరింత అవగాహన కల్పించి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి ఉపాధి మార్గాలను సమర్థవంతంగా కొనసాగించాలన్నారు. మహిళలు తయారు చేస్తున్న వస్తువులు,

- మిగతా 2 లో

చైనా ఎప్పుడు శాంతిపక్షమే

చర్చలు, సంప్రదింపులతోనే ఉక్రెయిన్ సంక్షోభానికి పరిష్కారం: జిన్‌పింగ్

బీజింగ్: చర్చలు, సంప్రదింపులతోనే ఉక్రెయిన్ సంక్షోభానికి పరిష్కారం సాధ్యమని, ఇందుకు అదొక్కటే మార్గమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. అణు యుద్ధంలో ఎవరికీ విజయం లభించదని అన్నారు. అంతర్జాతీయంగా తీవ్ర పరిస్థితులకు ఉక్రెయిన్ సంక్షోభం దారితీస్తోందని అన్నారు. చైనా ఎప్పుడూ శాంతి పక్షాన్నే నిలుస్తుందని, శాంతి చర్చలకు కట్టుబడుతుందని చెప్పారు. ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ పరిష్కారంపై తమ వైఖరిని ఇప్పటికే స్పష్టంచేసినట్లు తెలిపారు. బాధ్యతగల పెద్దదేశంగా, ఐరాస భద్రతా మండలి శాశ్వత సభ్యదేశంగా చైనా చేతిపై చేయి వేసుకొని కూర్చోదని, స్వలాభం కోసం ఈ పరిస్థితిని వాడుకోబోదన్నారు. చైనా ఏమి చేసినా అది బోర్డుకు అతీతంగానే ఉంటుందని అన్నారు. అణ్వాస్త్రాలపై సంబంధిత పార్టీలన్నీ సమన్వయం పాటించాలని, మానవాళి భవిష్యత్ దృష్ట్యా చర్యలు తీసుకోవాలని, కలిసి సంక్షోభాన్ని పరిష్కరించాలని జిన్‌పింగ్ సూచించారు. శాంతి సుస్థిరతకు చైనా కట్టుబడి ఉన్నదని చెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో ఫోన్లో మాట్లాడుతూ జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనా-ఉక్రెయిన్ సంబంధాలు, ఉక్రెయిన్ సంక్షోభంపై అభిప్రాయాలు పంచుకున్నారు. యురేసియన్ వ్యవహారాలపై చైనా ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిని ఉక్రెయిన్‌లో, ఇతర దేశాల్లో పర్యటించడానికి పంపనున్నట్లు జిన్‌పింగ్ చెప్పారు. ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ పరిష్కారంపై అన్ని పక్షాలతో కూలంకుషంగా చర్చలు జరిపేందుకే ప్రతినిధిని పంపుతున్నట్లు చెప్పారు. 31ఏళ్ల ద్వైపాక్షిక సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేరాయన్నారు. చైనాతో సహకారానికి సంబంధించి రెండు దేశాల మధ్య సంబంధాల అభివృద్ధిపై జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలను జిన్‌పింగ్ ప్రశంసించారు. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతపై పరస్పర గౌరవం అనేది ద్వైపాక్షిక సంబంధాలకు రాజకీయ పునాది వంటిదని అన్నారు. భవిష్యత్‌పై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. ఉక్రెయిన్‌తో సంబంధాలను అభివృద్ధి చేసుకోడానికి చైనా సుముఖంగా ఉన్నదని చెప్పారు.

వియత్నాం-చైనా వ్యూహాత్మక భాగస్వామ్యానికి 15ఏళ్లు

చైనా, వియత్నాం మధ్య సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యానికి ఈ ఏడాదితో 15ఏళ్లు పూర్తి అవుతాయని జిన్‌పింగ్ చెప్పారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ (సీపీవీ) కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యులు ట్రోంగ్ థి మైతో బీజింగ్‌లో జిన్‌పింగ్ భేటీ అయ్యారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి న్యూగెన్ ఫుట్రోంగ్‌తో దగ్గర సంబంధాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. రాజకీయ, వ్యూహాత్మక బంధాన్ని మరింత పటిష్ట పర్చుకోవాలన్నారు. సోషలిజం పురోగతికి రెండు దేశాలు కలిసి పనిచేయాలని జిన్‌పింగ్ సూచించారు. శాంతి-పురోగతికి చైనా, వియత్నాం తోడ్పాటును కొనియాడారు. తమ ప్రజలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అభివృద్ధి వ్యూహాలు, ప్రాజెక్టులు, ఆధునిక మౌలికవసతుల కనెక్టివిటీ, సంప్రదాయ మైత్రిని పెంచుకోవాలని సూచించారు.

ప్రతి భారతీయుడిని కాపాడటంపైనే దృష్టి

కొనసాగుతున్న ఆపరేషన్ కావేరి: క్వాత్రా



న్యూఢిల్లీ: సూడాన్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతూ అక్కడ అనిశ్చితి నెలకొన్నది. ఆ దేశంలో చిక్కుకున్న ప్రతి భారతీయుడిని అపాయం నుంచి తప్పించడంపైనే పూర్తిగా దృష్టిని కేంద్రీకరించామని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా తెలిపారు. ఆపరేషన్ కావేరి గురించి విలేకరులతో మాట్లాడుతూ సుమారు 2వేల మంది భారతీయులను ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి తరలించామన్నారు. గురువారం పోర్ట్ సూడాన్‌కు మూడో నౌక ఐఎన్ఎస్ తర్కష్ చేరుకున్నదన్నారు. పౌరుల తరలింపునకు మద్దతిస్తున్న సౌదీ అరేబియాకు కృతజ్ఞులమన్నారు. పౌరుల తరలింపు వేగం పుంజుకున్నట్లు క్వాత్రా తెలిపారు. ఈనెల 25న ఐఎన్ఎస్ సమేధా ద్వారా 278 మంది స్వదేశానికి చేరుకోగా సీ-130జే విమానంలో 121, 135 మంది చొప్పున చేరుకున్నారన్నారు. 26న మరో 297 మంది ఐఎన్ఎస్ టేగ్‌లో పయనం కాగా సీ-130జే 264 మందిని తరలించిందని చెప్పారు. సూడాన్‌లో ఘర్షణ పడుతున్న రెండు వర్గాలతో భారత్ సంప్రదింపులు జరుపుతోందని, వారి నుంచి సానుకూల స్పందన లభించిన క్రమంలో పౌరులను సురక్షితంగా తరలిస్తున్నట్లు చెప్పారు. ఖార్టూమ్‌తో అభివృద్ధిపరంగా బలమైన భాగస్వామ్యానికి న్యూఢిల్లీ కట్టుబడి ఉన్నదని ఆ వర్గాలకు తెలుసన్నారు. 'క్షేత్రస్థాయిలో క్లిష్టపరిస్థితులు ఉన్నాయి. తీవ్ర అనిశ్చితి నెలకొంది. సూడానీస్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (ఎస్ఏఎఫ్), రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్)తో సంప్రదింపులు జరుపుతున్నాం. మాకు సత్సంబంధాలు ఉన్నాయి. ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు ఆపై పోర్ట్ సూడాన్‌కు భారతీయులను తరలించేందుకు అన్ని వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నాం' అని క్వాత్రా తెలిపారు. సూడాన్‌లో ఉన్న భారతీయుల్లో మొత్తం 3,100మంది సూడాన్ రాజధాని కార్టూమ్‌లోని భారతీయ దౌత్యకార్యాలయంలో నమోదు చేసుకొన్నట్లు తెలిపారు. మరో 300 మంది దౌత్యకార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. సుమారు 900 నుంచి 1000 మంది వరకు భారత సంతతి ప్రజలు (పీఐఓ) సూడాన్‌లో ఉన్నారన్నారు. ఖార్టూమ్, పోర్ట్ సూడాన్‌కు మధ్య దూరం 850కిమీలు కాగా బస్సు ప్రయాణం 12 నుంచి 18 గంటలు (పరిస్థితిని బట్టి) పడుతుంది. నావికా దళానికి చెందిన ఐఎన్ఎస్ సమేధా, ఐఎన్ఎస్ టేగ్, ఐఎన్ఎస్ తర్కష్‌తో పాటు వైమానిక దళానికి చెందిన రెండు సీ130జే విమానాల ద్వారా జెడ్డా నుంచి భారతీయులను తరలిస్తున్నారు. జెడ్డా, పోర్ట్ సూడాన్‌లో వేర్వేరు కంట్రోల్ రూమ్‌లను భారత్ ఏర్పాటు చేసింది. 600 మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నట్లు క్వాత్రా తెలిపారు. ఇంకా 360 మంది జెడ్డా నుంచి చార్టర్డ్ విమానంలో న్యూఢిల్లీకి చేరుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 495 మంది జెడ్డాలో, 320 మంది పోర్ట్ సూడాన్‌లో ఉన్నారని అన్నారు. భారతీయులను పోర్టు సూడాన్‌కు తరలించేందుకు మరిన్ని బస్సులను నడుపుతున్నట్లు వెల్లడించారు. భారత సంతతి ప్రజల (పీఐఓ)నూ తరలిస్తారా అన్న ప్రశ్నకు వారు కోరితే తప్పకుండా చేస్తామని క్వాత్రా బదులిచ్చారు.

కొలంబియాలో కొత్త కేబినెట్

బొగోటా: కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో నూతన కేబినెట్‌ను ప్రకటించారు. ఏడు మంత్రిత్వ శాఖలైన ఆర్థికం, వ్యవసాయం, ఆరోగ్యం, సైన్స్, సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీస్, రవాణా, అంతర్గత రంగాల్లో కొత్త మంత్రులను నియమించినట్లు తెలిపారు. ఈ కేబినెట్ కొలంబియా ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. అధ్యక్ష పరిపాలక విభాగం డైరెక్టర్ స్థానాన్ని మార్చనుండగా కార్లోస్ రామన్ ఈ పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

మాయమాటలు చెప్పి కిడ్నీ దోచేశారు

(మొదటిపేజీ తరువాయి)

విజయ హాస్పిటల్ దగ్గర సంబంధిత టెస్టులు కూడా చేయించాడు. ఆ సమయంలో కిడ్నీ విక్రయం గురించి వినయ్‌కుమార్ ఇంట్లో తెలియడంతో అతను హైదరాబాద్ వెళ్లిపోయాడు. ఆ తర్వాత కామరాజు వినయ్ కుమార్ కు ఫోన్ చేసి మీ ఇంట్లో సామన్లు తీసుకొచ్చేస్తాను... మీ అమ్మానాన్నలను రోడ్డు మీదకి లాగేస్తాను అని బెదిరించడంతో భయపడిన వినయ్‌కుమార్ హైదరాబాద్ నుండి రావడంతో కిడ్నీ ముఠా సభ్యులు రైల్వే న్యూ కాలనీ వద్ద పట్టుకొని పెందుర్తి తిరుమల హాస్పిటల్ కి తీసుకెళ్లి వెంటనే మత్తు ఇంజక్షన్ ఇచ్చి కిడ్నీ తీయించేశారని బాధితుడు వాపోయాడు. రూ.8 లక్షలు చెల్లించడానికి అంగీకరించిన కామరాజు తదితరులు కేవలం రూ.2.5 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని బాధితుడు వినయ్‌కుమార్ లబోదిబోమన్నాడు. వారం రోజులు బాగానే ఉన్నా ప్రస్తుతం నడవలేకపోతున్నానని చెప్పాడు. తనతో పాటు మరికొందరి కిడ్నీలు కూడా లాగేశారని అతను తెలిపాడు. కాగా దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు, రిమ్స్ డైరెక్టర్ రాంబాబు, ఏసీపీ నరసింహామూర్తి, తహశీల్దార్ ఆనంద్ కుమార్ తదితరులు పెందుర్తిలోని తిరుమల ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ ఆదేశంతో దర్యాప్తు చేపట్టామని అధికారులు తెలియజేశారు.

కొండెక్కిన పప్పు ధరలు

(మొదటిపేజీ తరువాయి)

సోయాబీన్, పత్తి పంటల వైపు రైతులు మొగ్గు చూపడంతో పప్పు ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతోతంది. పప్పు పంటల విస్తీర్ణం ఆరు శాతం తగ్గడం, సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో కోతలకు ముందు భారీ వర్షాలు కురవడం వల్ల ఉత్పత్తి తగ్గింది. అనేక రాష్ట్రాలలో బలమైన ఈదురు గాలులు వీచడం వల్ల గోధుమలు, పప్పుధాన్యాల పంటలు దెబ్బతిన్నాయి. పప్పు ధాన్యాల లభ్యత సంతృప్తికర స్థాయిలో ఉండేలా చూసేందుకు, దేశీయ మార్కెట్‌లో ధరలను నియంత్రించేందుకు మోదీప్రభుత్వం మినుములు, కందుల స్వేచ్ఛా దిగుమతి విధానాన్ని 2024 మార్చి 31 వరకూ పొడిగించింది. అయితే పప్పుధాన్యాలను కేంద్రం దిగుమతి చేసుకుంటున్నంత వరకూ తమకు లాభాలు రాబోవని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని పప్పుధాన్యాలకు సంబంధించి రైతుకు కనీస మద్దతు ధర కంటే తక్కువే లభిస్తోంది. వినియోగదారులకు పప్పులు తక్కువ ధరకే లభించాలంటే గోధుమలు, బియ్యం మాదిరిగా వాటిని కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని వ్యాపారులు సూచిస్తున్నారు. పప్పుల మార్కెట్ ధరల కంటే కనీస మద్దతు ధర తక్కువగానే ఉంటోంది. దీంతో రైతులు పప్పుపంటల వైపు మొగ్గ చూపడం లేదు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రతికూల ప్రభావం పడుతోంది. దిగుమతి బిల్లులు పెరుగుతున్నాయి. వాణిజ్య సమతూకం దెబ్బతింటోంది. కనీస మద్దతు ధరల్లో తేడాల కారణంగా బియ్యం, గోధుమలకు ప్రత్యామ్నాయ పంటలు వేయడం రైతులకు సవాలుగా మారింది. అంతేకాకుండా బియ్యం, గోధుమలు రాజకీయ పార్టీలకు పెద్ద 'ఓటు బ్యాంకు'గా మారాయి. వీటిని కాదని వేరే పంటల వైపు మరలితే రైతుల నుంచి ప్రతిఘటన తప్పదని పార్టీలు భయపడుతున్నాయి.

మరోవైపు, ఎన్నికల సంవత్సరంలో పప్పుల ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వాలు కలవర పడుతున్నాయి. కందులు, మినుముల నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం నిల్వదారులు, మిల్లర్లు, ఫుడ్ ప్రాసెసర్లు, వ్యాపారులపై ఒత్తిడి తెస్తోంది. పప్పు ధరల పర్యవేక్షణకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. కానీ ధాన్యపు పంటలకు బదులుగా పప్పు ధాన్యాల పంటల వైపు రైతులను మళ్లిస్తే పరిస్థితిలో మార్పు వస్తుంది. దీనితో పాటు పప్పు పంటల రైతులకు సులభంగా రుణాలు అందించడం, బీమా సౌకర్యం కల్పించడం, ఆకర్షణీయమైన కనీస మద్దతు ధర ఇవ్వడం వంటి చర్యల ద్వారా ఉత్పత్తిని పెంచే అవకాశం ఉన్నదని రైతు సంఘాల నేతలు ప్రభుత్వాలకు సూచిస్తున్నారు. పేద-ధనిక, శాఖాహారం-మాంసాహారం అనే తేడా లేకుండా అందరూ పప్పుధాన్యాలు వినియోగిస్తారు. భారత్‌లో ఏటా రెండు కోట్ల టన్నుల పప్పు ధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రపంచ ఉత్పత్తిలో భారత్ వాటా ఇరవై ఐదు శాతమే. ప్రపంచంలో వినియోగిస్తున్న పప్పు ధాన్యాలలో ఒక్క భారత్‌లోనే 27 శాతం వినియోగమవుతోంది. సామాన్య ప్రజలకు మాంసకృత్తులు లభించాలంటే పప్పులే తప్పనిసరి. ఇంత ప్రాధాన్యత ఉన్న పప్పుధాన్యాల ఉత్పత్తికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యం.

ఏయూలో మద్యం పరీక్షలు

రాష్ట్ర ఎక్సైజ్ శాఖతో ఒప్పందం

విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఏయూలో ఆల్కహాల్ పరీక్ష కోసం ప్రాంతీయ ప్రయోగశాల ఏర్పాటు చేస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.3 కోట్ల పరికరాలతో ప్రాంతీయస్థాయి ప్రయోగశాలను ఏర్పాటు చేయనుంది. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బెండపూడి శ్రీనివాసులు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ లేబొరేటరీలో అన్ని రకాల మద్యం నమూనాలు పరీక్ష చేసేందుకు అధునాతన పరికరాలు ఉంటాయని ప్రొఫెసర్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కెమిస్ట్రీ విద్యార్థులు, ఫార్మసీ, లైఫ్ సైన్సెస్, ధాత్రి, పర్యావరణ శాస్త్ర విద్యార్థులు తమ పరిశోధన కోసం ప్రయోగశాలను ఉపయోగించుకోవచ్చని ప్రసాదరెడ్డి అన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ సమత, ప్రొఫెసర్ బసవయ్య పాల్గొన్నారు.

నాలుగేళ్లైనా క్రమబద్ధీకరించరా...

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆవేదన

విశాలాంధ్ర-విజయవాడ: విధుల్లోకొచ్చి నాలుగేళ్లైనాగానీ క్రమబద్ధీకరించకపోవడంపై రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. క్రమబద్ధీకరించని కారణంగా రూ.15వేలకు మించి జీతాలు రాకపోవడంతో మదన పడుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమ సెలవుల మంజూరు విషయంలో సానుకూలంగా స్పందించాలని, తమను రెగ్యులర్ చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల్లో కొందరు ఆరు నెలలు లేక అంతకంటే ఎక్కువ రోజులు సెలవులు పెట్టి ఉన్నారు. వారికి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు సెలవు మంజూరుతో పాటు ప్రొబేషన్ పిరియడ్‌ను ప్రకటించాల్సి ఉంది. కానీ అలా జరగడం లేదు. దీంతో ఉద్యోగులు ఆందోళనకు గురౌతున్నారు. జీతాలు కూడా ప్రతినెలా రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్రసాయి అధికారులు సకాలంలో స్పందించకపోవటంతో సచివాలయ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కూడా ఆందోళన చెందుతున్నారు. సెలవులు మంజూరు కాకపోవటం, జీతాలు రాకపోవడం, ప్రొబేషన్ డిక్లరేషన్ లేకపోవడం వంటివి వారిని ఇబ్బంది పెడుతున్నాయి. దీంతో ఉద్యోగులు రాజీనామాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 2019లో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలుగా వేలాది మంది చేరారు.

ఆ తర్వాత రెండేళ్లు విధుల్లో ఉండి, శాఖపరమైన పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించారు. ఇలా నాలుగేళ్లుగా పనిచేస్తున్నా రెగ్యులర్ కాలేదు. 2020లో చేరిన వారికి ప్రొబేషన్ పిరియడ్ డిక్లేర్ చేయడంతో పాటు కొత్త పీఆర్సీ ప్రకారం మేనెల నుంచి జీతాలు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు. తమ సమస్యల పరిష్కారానికిగాను ఉద్యోగ సంఘాల జోక్యాన్ని వారు కోరుతున్నారు.

సెలవురహిత విభాగంగా పాఠశాల విద్యాశాఖ

ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాఠశాల విద్యాశాఖను సెలవురహిత విభాగంగా ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. విద్యాశాఖ సంయుక్త సంచాలకులు మువ్వా రామలింగాన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. వేసవి సెలవులలో విద్యార్థులకు విద్యా, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం ఉపాధ్యాయుల సెలవులను హరించడమేనన్నారు. ఇదే క్రమంలో పాఠశాల విద్యాశాఖను సెలవు రహిత విభాగంగా ప్రకటించి, ప్రభుత్వ ఉద్యోగుల తరహాగా 30రోజుల సంపాదిత సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులందరికీ వేసవి సెలవుల కార్యక్రమాల ప్రణాళికను విడుదల చేస్తే, అందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా ఉత్తర్వులను రద్దు చేయాలని నేతలు డిమాండ్ చేశారు.

గర్జించిన ముదునూరు రైతులు

దిగొచ్చిన ప్రభుత్వ యంత్రాంగం

ధాన్యం కొనుగోలులో అక్రమాలపై విచారణ

విశాలాంధ్ర-ఉయ్యూరు: ఆర్‌బీకె కేంద్రం సిబ్బంది అవకతవకలకు పాల్పడి రైతుల నుంచి ధాన్యాన్ని కొనకుండా చేయడంపై రాష్ట్ర రైతుసంఘం కేవీవీ ప్రసాద్ అధ్వర్యంలో జరిగిన వరుస ఆందోళనలతో గురువారం ప్రభుత్వ యంత్రాంగం దిగివచ్చింది. జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో ఉయ్యూరు తహసీల్దార్ మస్తాన్‌రావు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఆఫ్‌లైన్‌లో మిల్లర్లకు ఆర్‌బీకే పూచికత్తుతో తోలిన 880 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన బాధిత రైతులకు ఈక్రాప్ట్ ప్రకారం చెల్లింపులు జరపాలని రైతుల పక్షాన జిల్లా రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తహశీల్దార్... మిల్లర్లతో రైతుల సమక్షంలోనే నిర్దేశిత ధర కోసం చర్చలు జరిపారు. ముదునూరు ఆర్‌బీకె పరిధిలో 9241 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చినప్పటికీ సిబ్బంది మాత్రం 5162 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని రైతులు వాగ్వాదానికి దిగారు. సొసైటీ అధ్యక్షుడు తుమ్మల సత్యనారాయణ తమకు కావాల్సిన వారికి అనువుగా ఈక్రాప్ట్ చేయించారని, అలాగే సంచులు కూడా ధాన్యం కల్లాలో ఉన్న రైతులను కాదని తనకు ఇష్టమైనవారికి కేటాయించడం వల్లే ఈసమస్య ఏర్పడిందని రైతన్నలు వాపోయారు. రైతుల అరుపులతో విచారణ ప్రాంగణం దద్దరిల్లింది. మిల్లర్లు ప్రభుత్వ ధరను ఇవ్వలేమని, రెండు రోజులు సమయం కావాలని అడగటంతో రైతులు అంగీకరించారు. ఆర్‌బీకె ద్వారా ఆఫ్‌లైన్‌లో ఉన్న బాధిత రైతుల వివరాలను ఆన్‌లైన్ చేయించేందుకు తాను చర్యలు తీసుకుంటానని తహశీల్దార్ భరోసా ఇవ్వడంతో రైతులు శాంతించారు.

మేడే జయప్రదం చేయండి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అన్ని జిల్లాల్లోని మున్సిపల్ కేంద్రాల్లో మేదినోత్సవాన్ని కార్మిక వర్గం జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. విజయవాడలోని దాసరి భవన్‌లో యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం మాల్యాద్రి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సుబ్బరాయుడు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను శరవేగంగా తీసుకురావడానికి పార్లమెంటులో సభ్యులతో చర్చలు జరపకుండా, మూజువాని ఓటుతోతో ఆమోదించుకుని 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చేసిందని, ఫలితంగా కార్మికులకు ఉద్యోగులకు పని భద్రత ప్రశ్నార్థకమైందన్నారు. రాజకీయ జోక్యం పెరిగిపోయి ఇష్టానుసారంగా కార్మికుల కుదింపు ప్రక్రియ చేపడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా కార్మికులు సాధించుకున్న లేబర్ కార్యాలయాలను సైతం దిష్టిబొమ్మలుగా మార్చేసిందన్నారు. మహిళా కార్మికులకు ప్రత్యేక సెలవులు ఐదు రోజులు జీవో వచ్చినప్పటికీ ఇంతవరకు ఏ ఒక్క మున్సిపాలిటీలోనూ అమలుకు నోచుకోలేదన్నారు. సచివాలయాల వ్యవస్థ వచ్చినప్పటి నుంచి కార్మికులు ఐక్యంగా ఉండకుండా, వారి సమస్యలపై స్పందించకుండా బలహీనపడేలా ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు.

ఈ సమావేశంలో యూనియన్ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాస్, ఉపాధ్యక్షులు పులగం మద్దిలేటి, కల్లూరు జాన్, భజంత్రి శ్రీనివాస్, ఉప ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, కార్యదర్శులు రాజేష్ గౌడ్, రామచంద్రయ్య, నాసర్ వలి పాల్గొన్నారు.

కొత్త పీఆర్సీపై త్వరలో నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశం ముగిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ చట్టబద్ధంగా ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.1800 కోట్ల బకాయిలు ఇంకా చెల్లించలేదని, అవి ఎప్పుడు చెల్లిస్తారో తెలియదన్నారు. పీఆర్సీ బకాయిలు కూడా ఎంత ఇవ్వాలో లెక్కలు చూస్తామని అధికారులు చెప్పారన్నారు. రూ.4కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుందన్న సాకుతో కొత్త పేస్కేల్స్ ఆమోదం నిలిపివేస్తారా అని ప్రశ్నించారు. పోలీసుల, వైద్యశాఖలో పనిచేస్తున్న వారికి ఇచ్చే ప్రత్యేక చెల్లింపులకు కాలపరిమితి వద్దని చెప్పామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. కొత్త జిల్లా కేంద్రాల్లో 16 శాతం హెచ్ఆర్ఏ ఉత్తర్వులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. సాధారణ బదిలీలు, వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలపైనా త్వరలోనే నిర్ణయానికి వస్తామని మంత్రుల కమిటీ చెప్పిందని వివరించారు. ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చే వరకూ తమ ఉద్యమ కార్యాచరణ కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఉద్యమ ఫలితంగానే రూ.5,860 కోట్ల బకాయిలు ఇచ్చారని బొప్పరాజు చెప్పారు.

వివేకా కేసులో సీబీఐ దూకుడు

(మొదటిపేజీ తరువాయి)

చెబుతుందని, దాన్నివాడుతున్న వ్యక్తిని కాదని తెలిపారు. అలాగే ఇంట్లో ఉన్నప్పుడు 20 మీటర్ల లొకేషన్ తేడా చూపిస్తుందని గూగుల్ చెప్తుందన్నారు. అప్రూవర్ గా మారిన నిందితుడు దస్తగిరి బెయిల్ పిటిషన్ ను సీబీఐ వ్యతిరేకించకపోవడం, తాను కోరుకున్న విధంగా దస్తగిరి చెప్పేలా సీబీఐ ఒత్తిడి తెచ్చిందంటూ హైకోర్టు దృష్టికి తెచ్చారు. అలాగే అవినాష్ రెడ్డిని నిందితుడిగా మార్చేందుకు సీబీఐ హియర్ అండ్ సే సాక్ష్యంపై ఆధారపడిందని, వాస్తవానికి ఆ సాక్ష్యం చెల్లదని స్పష్టం చేశారు. అలాగే దస్తగిరి అరెస్ట్ అయినప్పుడు వివేకా హత్యలో ఐదుగురు మాత్రమే ఉన్నారని చెప్పాడని, తర్వాత సీబీఐ మరో స్టేట్‌మెంట్ తీసుకుందన్నారు. అందులో అవినాశ్, భాస్కర్ రెడ్డి పేర్లు చెప్పారన్నారు.

తర్వాత దస్తగిరి ముందస్తు బెయిల్ కోరితే సీబీఐ వ్యతిరేకించలేదని గుర్తుచేశారు. ఇలా ముందస్తు బెయిల్‌ను సీబీఐ వ్యతిరేకించకపోవడం న్యాయ సమ్మతం కాదన్నారు. అవినాశ్ రెడ్డి లాయర్ వాదనలు ముగిసిన తర్వాత సునీతారెడ్డి, సీబీఐ తరఫు న్యాయవాదులు కూడా తమవాదనలు వినిపించారు. అయితే అప్పటికే సమయం ముగియడంతో హైకోర్టు శుక్రవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు విచారణను వాయిదా వేసింది.

మోదీ విధానాలపై మీ వైఖరేమిటి?

(మొదటిపేజీ తరువాయి)

భూములను అదానీకి కట్టబెట్టారని గుర్తుచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తూ...అదానీ ఆస్తులు పెంచుతున్న మోదీ విజన్ బాగుందని చెప్పడం చంద్రబాబుకు తగదన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామని అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు, జగన్ స్పందించాలన్నారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న మోదీ విధానాలపై వైసీపీ, టీడీపీ వైఖరి ఏమిటని రామకృష్ణ ప్రశ్నించారు.

బీజేపీ ప్రభుత్వ విధానాలు, ప్రధాని మోదీ నిర్ణయాలతో దేశం తిరోగమనంలో పయనిస్తోందని రామకృష్ణ విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలపై సీపీఐ, సీపీఎం ఉద్యమభేరి మోగించాయని, తమ యాత్రల్లో మోదీ, జగన్ ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. గుజరాత్ తరహా అభివృద్ధి ప్రచారంతో బీజేపీ, మోదీ ప్రజలను మోసగించారని మండిపడ్డారు. 9 ఏళ్లు గడిచినా దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు, అవినీతి, నల్లధనం సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. మోదీ హయాంలో ప్రపంచంలో అత్యంత దారిద్ర్య దేశంగా భారత్ నిలిచిందని ఆగ్రహం వెలిబుచ్చారు. నిరుద్యోగం చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 45శాతం పెరిగిందన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు కాకపోగా...అన్నదాతను అప్పుల ఊబిలో దించారని తెలిపారు. మోదీ ప్రభుత్వ హయాంలో అదానీ, అంబానీలు మాత్రమే బాగుపడ్డారన్నారు. సుపరిపాలనలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ ఎన్‌టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల సాధికారతే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉత్పాదనలకు మంచి మార్కెట్ వ్యవస్థ ఉండాలన్నారు. దీనికోసం బహుళజాతి కంపెనీలతో అనుసంధానం కావాలని సూచించారు. 45-60 సంవత్సరాల వయస్సు మధ్యలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళల సాధికారతే లక్ష్యంగా చేయూత పథకం చేపట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా తొమ్మిది లక్షలమంది స్వయం ఉపాధి పొందుతున్నారని అధికారులు వెల్లడించారు. గ్రామాల్లో నిత్యావసర వస్తువులను మార్కెట్ ధర కంటే తక్కువకే అందించాలన్న లక్ష్యంతో స్వయం సహాయక సంఘాల మహిళలతో సూపర్ మార్కెట్‌లు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు మొత్తం 27 చేయూత మహిళా మార్టులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఒక్కో సూపర్ మార్టులో కనీసం నెలకు రూ.30 లక్షలు టర్నోవర్ లక్ష్యంగా ఏర్పాటు చేశామని, వ్యాపారాన్ని అభివృద్ధి చేసేందుకు డోర్ డెలివరీ, ఆన్‌లైన్ బుకింగ్, వాట్సప్ బుకింగ్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నామని అధికారులు తెలిపారు. బహుళజాతి కంపెనీలతో భాగస్వామ్యం వల్ల వారి ఉత్పత్తుల్లో కనీసం 8 నుంచి 25 శాతం మార్జిన్ ఉండేట్టు ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ జిల్లాలో సామర్లకోటలో వస్త్ర పేరుతో ఏర్పాటు చేసిన దుస్తుల తయారీ యూనిట్‌లో 200 మంది మహిళలకు ఉపాధి లభిస్తోందని, ట్రెండ్స్, అజియో వంటి కంపెనీలతో ఒప్పందం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లా కురుబలకోటలో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేశామని, ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 3వేల కుటుంబాలకు చేయూత అందుతోందని తెలిపారు. ఉపాధి హామీలో భాగంగా ఈ ఏడాది 1500 లక్షల పనిదినాలు కల్పించాలని, ఇందుకోసం రూ.5280 కోట్లు ఉపాధిహామీ కింద ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మెటీరియల్ రూపంలో రూ.3520 కోట్లు ఖర్చు చేయాలని, మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.8800 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్కులు పూర్తిచేయాలని, గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీల నిర్మాణం పైన దృష్టిపెట్టాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ) బూడి ముత్యాలనాయుడు, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ సూర్యకుమారి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ పి బసంత్ కుమార్, సెర్ప్ సీఈఓ ఏ ఎండీ ఇంతియాజ్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

అమూల్‌ను తరిమికొడదాం

రౌండ్ టేబుల్‌లో వక్తల పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): రాష్ట్రంలో సమర్థవంతంగా పనిచేస్తున్న విజయ, సంగం తదితర సహకార డెయిరీలకు నష్టం కలిగించాలనే ఉద్దేశంతో వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఖర్చుతో పాలు సేకరించి అమూల్‌కు ఇస్తున్నారని, దీనివల్ల ఏ ఒక్క పాడి రైతుకు మేలు జరగడం లేదని రౌండ్‌టేబుల్ సమావేశం విమర్శించింది. అమూల్ వల్ల సహకార డెయిరీలు నిర్వీర్యమవుతున్నాయని, అమూల్‌ను రాష్ట్రం నుండి తరిమికొట్టాలని పిలుపునిచ్చింది. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి అధ్వర్యంలో అఖిలపక్ష రైతుసంఘాల నాయకులు గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ అమూల్‌కు లబ్ధి చేకూర్చేందుకే జగన్ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. చిత్తూరు జిల్లాలో రోజుకు 4.5 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్న శ్రీజ మహిళా పాలఉత్పత్తిదారుల సహకార సంఘానికి ప్రభుత్వం బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మూతపడిన చిత్తూరు డెయిరీని ఆ మహిళా సంఘానికి ఇవ్వకుండా అమూల్‌కు 99 సంవత్సరాలు లీజుకివ్వడం సరికాదన్నారు. చిత్తూరు, ఒంగోలు డెయిరీల ఆస్తులతో పాటు 3 వేల కోట్ల రూపాయలు అమూల్‌కు కట్టబెట్టారని, మరో రూ.3000 కోట్ల అప్పు తెచ్చి అమూల్ కోసం ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. కర్నాటకలో అమూల్ ప్రవేశాన్ని బీజేపీ ప్రవేశాన్ని నిలిపివేసిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి కూలీల నిధులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడానికి వైసీపీ ప్రభుత్వం పావులు కదుపుతోందని విమర్శించారు. వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆర్‌బీకేలు, సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. రాష్ట్రంలోని విజయ, సంగం, విశాఖపట్నం డెయిరీ వంటి సంఘాలను కాపాడాల్సిన ప్రభుత్వం...అమూల్ పేరుతో మన డెయిరీలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయంపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్ మేధావుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ అవినీతిపరుడైన ఆర్‌ఎస్ సోదితో సీఎం జగన్ కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పాడి రైతుల డెయిరీలను అమూల్‌కు తాకట్టు పెట్టారన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ విజయ డెయిరీ రూ.1100 కోట్ల టర్నోవర్‌తో, సంగం డెయిరీ రూ.1300 కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయన్నారు. అలాంటి వాటిని పక్కనపెట్టి అమూల్‌కు మద్దతివ్వడమేమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

సామాజిక ఉద్యమకారుడు టీ.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశాఖ డెయిరీ, సంగం డెయిరీ, కృష్ణ మిల్క్ యూనియన్‌కు రూపాయి సహాయం చేయని జగన్‌రెడ్డి... అమూల్‌కు రూ.6000 కోట్లు తగలేస్తున్నారని, కమీషన్ల కోసం, కేసుల మాఫీ కోసం కాదా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు వై.కేశవరావు మాట్లాడారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, ప్రకాశం జిల్లా ఐక్యవేదిక కన్వీనర్ చుండూరు రంగారావు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర, నల్లమడ రైతుసంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్, ఏఐకేఎం రాష్ట్ర కార్యదర్శి డి.హరినాథ్, ఆంధ్రప్రదేశ్ పౌం సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ బాబురావు, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, వినియోగదారుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ఆంజనేయులు, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, రైతుసంఘాల నాయకులు ఎం.హరిబాబు, సీహెచ్ కృష్ణాంజనేయులు, మర్రెడ్డి వెంకటరెడ్డి, కల్లం రాజశేఖర్‌రెడ్డి, ఎంసీహెచ్ శ్రీనివాస్, టీ.ఆంజనేయులు పాల్గొన్నారు.

జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మకు ఏఐటీయూసీ నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరజీవి జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మ 38వ వర్ధంతిని గొల్లపూడి జేవీఎస్ ట్రస్టు (జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మ ట్రస్ట్)లో గురువారం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్వర్యంలో నిర్వహించారు. సుబ్బమ్మ, సత్యనారాయణ దంపతుల చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ, సుబ్బమ్మ, సత్యనారాయణ త్యాగాలు, స్త్రీల అభ్యుదయానికి వారు చేసిన కృషి, వారు స్థాపించిన జేవీఎస్ ట్రస్ట్, టైలరింగ్, కంప్యూటర్ కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న తీరును ప్రశంసించారు. ఈ దంపతులు ఆదర్శవంతమైన కులాంతర వివాహాలు ప్రోత్సహించి విద్యావంతులను చేయడానికి, స్వశక్తి మీద నిలబడటానికి కృషి చేశారన్నారు. వారి ఆదర్శాలకు అనుగుణంగా జేవీఎస్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా ఉచితంగా కంప్యూటర్, టైలరింగ్, వృత్తులను నేర్పించి స్వయం శక్తిగా ఎదగడానికి ట్రస్ట్ కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ నిర్వాహకులు దుర్గాప్రసాద్, టైలరింగ్ నిర్వాహకులు పుష్పాంజలి పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల బకాయిలు విడుదల చేయాలి

సీఎంకు సీపీఎం నేత శ్రీనివాసరావు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధి హామీ కూలీల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు, వడదెబ్బతో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం ఆయన లేఖ రాశారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు ప్రధానమైన వనరుగా పేర్కొన్నారు. పనులు బాగా కల్పించిన చోట పేదల వలసలు తగ్గాయని, పేదల కొనుగోలు శక్తి పెరిగిందని తెలిపారు. చిన్న, సన్నకారు రైతుల భూములు అభివృద్ధి చెందాయని, చెరువు పూడికతీతల వల్ల భూగర్భ జలాలు పెరిగినట్లు ప్రభుత్వ లెక్కలు తెలుపుతున్నాయని వివరించారు. ఉపాధి హామీ చట్టం అంటే గ్రామీణ పేదలకు ఒక వరం లాంటిదని, ఇంతటి ప్రాధాన్యత కలిగిన చట్టానికి కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గించింద న్నారు. పని ప్రదేశాలలో మౌలిక వసతులు కల్పించడం లేదని, వేసవి అలవెన్స్ రద్దు చేసిందని, చేసిన పనికి నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదని వివరించారు. ఉపాధి హామీ చట్టం సమర్థవంతంగా అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం తమ బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఉపాధి హామీని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని, దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం తమ బడ్జెట్‌లో కనీసం వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని, 100 రోజులు చేసిన కుటుంబాలకు అదనంగా 50 రోజులు ఇవ్వాలని, బకాయిలు ఉన్న కూలీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

డా.అచ్చెన్న హంతకులకు ప్రభుత్వం అండ

కరవది సుబ్బారావు విమర్శ

విశాలాంధ్ర-ఒంగోలు: డాక్టర్ అచ్చెన్న హత్యకేసును ఇంకెన్నాళ్లు సాగదీస్తారని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరవది సుబ్బారావు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'గత నెల 12వ తేదీన అదృశ్యమైన అచ్చెన్న 24వ తేదీన శవంగా లభ్యమైంది. పోలీస్ అధికారులు కేసును ఛేదించటంలో నిర్లక్ష్య వైఖరి అవలంబించటం అనుమానాలకు తావునిస్తున్నది. పోస్టుమార్టం సమయంలోనూ కుటుంబ సభ్యుల సంతకాలు తీసుకోలేదు. పోస్టుమార్టం నివేదికను ఇప్పటి వరకు కుటుంబ సభ్యులకు అందించకపోవటం నిందితులను కాపాడేందుకేనన్న భావన కలుగుతోంది. నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్ నుండి తొలగించడానికి తమపై వత్తిడి చేస్తున్నట్లు అచ్చెన్న కుమారుడు ప్రకటించారు. దళిత సంఘాలు, బాధిత కుటుంబం, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, అభ్యుదయవాదులు ఆందోళనలు చేసినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేకపోవటం దుర్మార్గం. దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు దళితులపై జరుగుతున్న హత్యాకాండలను, దాడులను వ్యక్తిగత ఘటనలుగా పేర్కొనటం, వాటికి ప్రభుత్వం బాధ్యత వహించదని చెప్పడం సిగ్గుపడాల్సిన అంశం. రాజ్యాంగం బడుగు, బలహీనవర్గాలకు కల్పించిన హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది. రాష్ట్రంలో దళితులపైనా, దళిత ఉద్యోగులపై జరుగుతున్న హత్యలపై ప్రభుత్వం కనీసం సమీక్ష చేయకపోవటం దుర్మార్గం, ఇది ఒక వర్గానికి కొమ్ముకాస్తున్నట్లు స్పష్టమవుతోంది. దళితులు, బడుగు, బలహీన వర్గాలు ఐక్యంగా పాలకుల కుట్రలను తిప్పికొట్టాలి' అని సుబ్బారావు పిలుపునిచ్చారు.

ఒలింపిక్ మెడల్ సాధిస్తా: ధీరజ్

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: 2024 ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత ఆర్చరీ జట్టులో స్థానం సాధించి దేశానికి పతకాన్ని అందజేస్తానని ఆర్చరీ వరల్డ్ కప్ 2023 స్టేజ్-1 రికర్వ్ వ్యక్తిగత కాంస్య పతక విజేత, భారత జట్టు రజత పతక విజేత బొమ్మదేవర ధీరజ్ అన్నాడు. తన వ్యక్తిగత కాంస్య పతకం, జట్టు రజత పతకాన్ని తన కోచ్ చెరుకూరి లెనిన్, అతని తల్లిదండ్రులతో పాటు చెరుకూరి ఆర్చరీ అకాడమీకి అంకితం ఇస్తున్నట్లు అతను చెప్పాడు. ఇటీవల టర్కీలోని అంటాల్యలో జరిగిన ఆర్చరీ ప్రపంచకప్ 2023 స్టేజ్-1లో విజయవాడకు చెందిన బొమ్మదేవర ధీరజ్ భారత ఆర్చరీ రికర్వ్ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. విజయవాడలోని చెరుకూరి ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు.ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నీ ముగించుకుని విజయవాడ చేరుకున్న ధీరజ్ గురువారం చెరుకూరి ఆర్చరీ అకాడమీకి వచ్చాడు. విజయవాడలోని మహానాడు రోడ్డు పక్కనే ఉన్న తన కోచ్ చెరుకూరి లెనిన్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ, టెక్నికల్ కమిటీ ఇన్‌చార్జ్ బివి రమణ తదితరులు ధీరజ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ధీరజ్... ప్రస్తుతం ఆర్చరీ వరల్డ్ కప్ 2023 స్టేజ్-2, వరల్డ్ కప్, ఆసియా చాంపియన్‌షిప్‌లపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ మూడింటిలో మెరుగైన ప్రదర్శన కనబర్చిన తర్వాత 2024లో పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు భారత ఆర్చరీ జట్టుకు ప్రాతినిథ్యం వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఒలింపిక్ పతకం సాధించి నా గురువు దివంగత చెరుకూరి లెనిన్ కలను నెరవేరుస్తానన్నారు. మే 15 నుంచి 22 వరకు చైనాలోని షాంఘైలో వరల్డ్ కప్ స్టేజ్-2 ఛాంపియన్‌షిప్ జరగనుందని, ఈ టోర్నమెంట్‌లో మంచి ప్రదర్శన కనబర్చి జులైలో జర్మనీలోని బెర్లిన్‌లో జరిగే ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాలని ఆయన అన్నారు. విజయవాడకు చెందిన ఇద్దరు ఆర్చర్లు బొమ్మదేవర ధీరజ్, వెన్నం జ్యోతి సురేఖలు పతకాలు సాధించడం పట్ల ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. సురేఖ కూడా 2007 నుంచి 2013 వరకు ఓల్గా ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. కృష్ణా జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు వేమూరి వేణుగోపాల్, ఏపీఏఏ కోశాధికారి, ధీరజ్ తండ్రి బీ శ్రావణ్ కుమార్, కోచ్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి నిరసన సెగ

విశాలాంధ్ర-చింతపల్లి: గిరిజన చట్టాలు, హక్కులను అతిక్రమించి జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం తీసుకున్న అనుమతులకు వ్యతిరేకంగా గిరిజనులు ఉద్యమిస్తున్నారు. ఇదే సమయంలో 'జగనన్నే మా భవిష్యత్తు, నువ్వే మా నమ్మకం జగన్' కార్యక్రమాలతో గడపగడపకు వెళ్లిన పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మికి గిరిజనుల నుంచి నిరసన సెగ తగిలింది. చింతపల్లి మండలం గొందిపాకల పంచాయతీ కొయ్యూరు మండల సరిహద్దు ప్రాంతంలో జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను నిరసిస్తూ వామపక్షాల అధ్వర్యాన ఉద్యమం నడుస్తోంది. అనేకసార్లు ఈ రెండు పార్టీలు సమావేశాలు నిర్వహించాయి. తాజాగా ఆ గ్రామాల పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని స్థానికులు అడ్డుకున్నారు. జలవిద్యుత్ ప్రాజెక్టు వల్ల తమ గ్రామాలు తొలగించే పరిస్థితి ఉంటుందని, తామంతా నిర్వాసితులమవడమే కాకుండా భూమి, పచ్చని అటవీ ప్రాంతం, కాఫీ, మిరియాల తోటలు దెబ్బతింటాయని భ్యాగలక్ష్మికి స్థానికులు చెప్పారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే 32 గిరిజన గ్రామాలు ముంపునకు గురవుతా యని, దీనిపై గిరిజన మహిళగా, ప్రజాప్రతినిధిగా ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై చట్టసభలలో గిరిజన గళం వినిపించాలని, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి 32 గ్రామాల ముఖ్యనాయకులు, పెద్దలు తనతో వస్తే అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేద్దామని హామీ ఇచ్చారు. జల విద్యుత్ ప్రాజెక్టు వల్ల జరిగే నష్టాన్ని వివరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్తానని ఆమె హామీ ఇచ్చారు.

భవన నిర్మాణ కార్మికులపై నిర్లక్ష్యం

జగన్ ప్రభుత్వంపై ఓబులేసు విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యల పరిష్కారంపై జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కార్మికుల సంక్షేమ బోర్డు నిధుల్ని పక్కదారి పట్టించిందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ అధ్యక్షతన గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగింది. ఓబులేసుతోపాటు భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఎస్.వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి పడాల రమణ తదితరులు ప్రసంగించారు. ఓబులేసు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని, జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నూతన పాలసీ అంటూ ఇసుకను అంగడి సరుకుగా చేశారని విమర్శించారు. కార్మికులకు ఉపాధి పనులు లేక పస్తులతో అల్లాడుతున్నా పట్టించుకునే నాధుడే లేడని దుయ్యబట్టారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి...వందలాది కోట్ల రూపాయల బోర్డు సొమ్మును ప్రభుత్వ అవసరాలకు వాడుకోవడం దారుణమన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష పోరాటమే శరణ్యమని, ఐక్య ఉద్యమాలతో ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమ బోర్డు దగ్గర ఇప్పటికీ రూ.930 కోట్లు ఉన్నట్లు కార్మికశాఖ కమిషనర్ చెబుతున్నారని, అయినా 32 వేల క్లెయిములు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. తక్షణం బోర్డును పునరుద్దరించి పెండింగ్ క్లెయిములు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పడాల రమణ మాట్లాడుతూ నిర్మాణరంగ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగినందువల్ల పనులు లేక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో భవననిర్మాణ కార్మికులందరినీ కూడగట్టి ప్రభుత్వం సంగతి తేలుస్తామన్నారు. పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మే15వ తేదీన కలెక్టరేట్లను ముట్టడిస్తామన్నారు. 30న విజయవాడ ధర్నా చౌక్‌లో శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. యూనియన్ రాష్ట్ర నాయకులు యు.మద్దిలేటి, ఎస్.శ్రీరాములు, డీసీ రెహ్మాన్, కాసా సాంబయ్య, సోనా రాజు, మల్లికార్జున, షేక్ ఉమర్ వల్లి, బల్లాడ నాగరాజు, తోకల ప్రసాద్, చల్లా వెంకటరమణ పాల్గొన్నారు.

యాభైవేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు

విశాలాంధ్ర-డోన్: ఉద్యోగాలను భర్తీ చేయకుండా వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంతో నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు పేర్కొన్నారు. గురువారం నంద్యాల జిల్లా డోన్‌లోని నక్కి రామన్న భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్లు ఇచ్చి ఏ నెలలో ఉద్యోగాలు భర్తీ చేస్తామో నోటిఫికేషన్ ఇస్తామని చెప్పినప్పటికీ ఆచరణ శూన్యమన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ రాక బీఈడీ, టీటీసీ అభ్యర్థులను నిరాశ గురవుతున్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న 50వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సబ్ రిజిస్ట్రార్లు, డిప్యూటీ తహసీల్దారు, గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేసి... వాటిని భర్తీ చేయాలని కోరారు. సుమారు 20వేలకు గా పైగా ఉన్న ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేసి పోలీసులు పై పని భారం తగ్గించాలని, రాష్ట్రలో శాంతి భద్రతల్ని అదుపులో ఉంచేందుకు పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రధాన కర్తవ్యంగా ప్రభుత్వం తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కల్తీ ఆహారాల నియంత్రణ కోసం రాష్ట్రంలో 26 జిల్లాలకు కలిపి కేవలం 19 మంది మాత్రమే ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నారని, మండలానికి ఒక ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించడం ద్వారా కల్తీ ఆహారాన్ని నిరోధించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భక్తి కోసం అన్ని విద్యార్థి యోజన సంఘాలు ఐక్య కార్యాచరణలతో ఉద్యమ బాట పట్టేందుకు నిరుద్యోగులు సిద్ధమవుతున్నారని ప్రభుత్వం మేల్కొని మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. స్వయం ఉపాధి కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ లకు అధిక నిధులు కేటాయించి వడ్డీ లేని రుణాల ద్వారా ఉపాధి కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి విజయ్, డోన్ టౌన్ కన్వీనర్ దివాకర్, తాలూకా నాయకులు రాఘవేంద్ర, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో సమీకృత ఆర్థిక భవనం ప్రారంభం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా కేంద్రమైన ఏలూరులో సుమారు రూ.10 కోట్లతో నిర్మించి అన్ని వసతులు కల్పించిన జిల్లా సమీకృత ఆర్థిక భవన సముదాయాన్ని గురువారం రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ ఆర్కిటెక్ ప్రమాణాలతో వివిధ శాఖల భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కిటెక్చరల్ బోర్డు(ఏపీఎస్ఏబీ) ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిద్వారా ఆయా ప్రభుత్వ భవనాలు వినియోగం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణాత్మక పద్ధతి ప్రకారం డిజైన్ రూపొందించి నిర్మించడం జరుగుతుందన్నారు. ఏసీలపై పూర్తిగా ఆధారపడకుండా తాజా గాలి, వెలుతురు వచ్చేలా భవన నిర్మాణాలు ఉంటాయన్నారు. ఉద్యోగులు ఉత్తమసేవలు అందించేందుకు వీలుగా కూర్చునే కూర్చీల నుంచి ప్రతి ఒక్క పర్నిచర్‌ను నాణ్యతా ప్రమాణాల మేరకే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏలూరులో గతంలో ఖజానా, ఆడిట్, బీమా, ఇలా వివిధ విభాగాలు వేర్వేరు చోట్లనుంచి పనిచేసేవని ఇప్పుడు వాటన్నింటిని ఒకే భవనంలో సమీకృత ప్రాంగణంలో ఏర్పాట య్యాయన్నారు. దీనివల్ల మరింత బాగా ఆయా విభాగాలు సేవలు అందించేందుకు వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ , జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, ఆర్థికశాఖ కార్యదర్శి డా. కేవీ సత్యనారాయణ, ట్రెజరీ డైరెక్టర్ కేవీ మోహన్ రావు, డైరెక్టర్ ఆఫ్ వర్క్ ఎకౌంట్స్ సీహెచ్‌కే మల్లేశ్వరరావు, ఏపీపీఎఫ్ ఎస్ఎస్ సీఈఓ బి.సునీల్ కుమార్ రెడ్డి, ఎపిజిఎల్ఐ డైరెక్టర్ రెడ్డి శ్రీనివాసరావు, స్టేట్ ఆడిట్ డైరెక్టర్ హరిప్రకాష్, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, ఎపిఇడబ్ల్యూఐడిసి యండి సి. దీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా

విశాలాంధ్ర-చింతపల్లి: మన్యం ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి పశువులను యథేచ్ఛగా అక్రమంగా రవాణా చేస్తున్నారు. కట్టడి చేయాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు పాడేరు మండలం గుత్తుల పుట్టు నుంచి జీ మాడుగుల, చింతపల్లి, రింతాడ, పెదవలస మీదుగా పశువులను మైదాన ప్రాంతంలో ఉన్న గోవధ శాలలకు తరలిస్తున్నారు. ప్రస్తు తం మన్యంలో గోవుల్ని కాసేందుకు సరైన ప్రదేశాలు లేకపోవడం, వాటికి సరిపడా పశుగ్రాసం అందించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం, వ్యవసాయ పనులలో సమూల మార్పులు వచ్చి పశువుల స్థానంలో యం త్రాలు ఉపయోగించడం వంటి అనేక కారణాలతో రైతులు తమ వద్ద ఉన్న పశువులను విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యాపారులు పశువులను మన్యంలో కొనుగోలు చేసి మైదాన ప్రాంతంలో ఉన్న గోవధ శాలలకు తరలిస్తున్నారు. మూగజీవాలను గోవధ శాలలకు తరలించడం అమానుషమని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పశు ప్రేమికులు కోరుతున్నారు.

రైతుల బాధలు వింటుంటే కన్నీళ్లొచ్చాయి: లోకేశ్

విశాలాంధ్ర-మంత్రాలయం: రైతులు పడుతున్న కష్టాలు పాదయాత్ర ద్వారా నేరుగా తెలుసుకున్నానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. కర్నూలు జిల్లాలో వ్యవసాయ పనులు లేక గుంటూరు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి పనులు చేసుకుంటున్నారని, వాళ్ళతో మాట్లాడి వారి బాధలు తెలుసుకుంటే కన్నీళ్లు వచ్చాయని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. పాదయాత్రలో భాగంగా కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం లచ్చుమర్రి క్రాస్ వద్ద రైతులతో ముఖాముఖి నిర్వహించారు. నీళ్లు ఇస్తే రాయలసీమ రైతులు బంగారం పండిస్తారని స్పష్టం చేశారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం టీడీపీ హయాంలో 11 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని తెలిపారు. జగన్ ప్రభుత్వం నాలుగేళ్లలో టీడీపీ ప్రభుత్వం ఖర్చు చేసిన దానిలో పది శాతం కూడా ఖర్చు చేయలేదని, డ్రిప్ ఇరిగేషన్ రద్దు చేసి రాయలసీమరైతాంగాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోతే కనీసం పంట నష్టం అంచనా వేసే దిక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల రాజ్యం తెస్తామన్న జగన్... రైతులు లేని రాజ్యం తెచ్చారని ధ్వజమెత్తారు. రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలో 3వ స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే 2వ స్థానంలో ఉందని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

వలసలతో పల్లె కన్నీరు పెడుతుంతోంది...

లోకేశ్ మాధవరం గ్రామంలో వలసలు వెళుతున్న వారిని చూసి టీడీపీ అధికారంలోకి వస్తే వలసలను నివారిస్తానని హామీ ఇచ్చారు. వలసలతో పల్లె కన్నీరు పెడుతోందని ఆవేదన వెలిబుచ్చారు. ఒక కుటుంబానికి ఎంత కష్టం వచ్చిందో చూస్తుంటే గుండె తరుక్కుని పోతుందని కుటుంబాలన్నీ వలసలు పోతుంటే పల్లె కన్నీరు పెడుతుందని ఇంటిలిపాది మండుటెండలో ఉపాధిని వెతుక్కుంటూ వెళ్లి తిరిగి వస్తున్న దృశ్యాలు ఆందోళనలకు గురి చేస్తున్నాయని అన్నారు. బడిలో చక్కటి రాతలు నేర్చుకోవాల్సిన చిట్టి చేతులు మట్టి పనులుకి తల్లిదండ్రులతో తరలిపోతున్నారని మెతుకు కోసం బతుకు కోసం వంద కిలోమీటర్లు ప్రమాదకర ప్రయాణం చేస్తున్న వలస జీవులు మన పరదాల ఎలిఫ్యాంటర్ సీఎంకి కనిపించే అవకాశమే లేదు అని అన్నారు. మాధవరం మీదుగా పాదయాత్ర చేస్తున్న నారా లోకేశ్‌కు డీసీఎంవ్యాన్‌లో పిల్లలతో కలిసి వలస వెళ్లి వస్తున్న కుటుంబాలు ఎదురయ్యాయి. వారితో మాట్లాడేందుకు ఆయన డీసీఎం కారు ఎక్కారు. వ్యవసాయానికి నీటి వసతి లేక చేసేందుకు పని లేక ధరలు భారమై తెలంగాణ ప్రాంతానికి అలాగే గుంటూరుకి వెళ్లి పనులు చేసుకుని తిరిగి వస్తున్నామని వలస వెళ్లిన బాధితులు చెప్పారు. ఏడాదిలో ఆరు నెలలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన దుస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వలసలు జగన్ రెడ్డి విధ్వంస పాలన విష ఫలితం అని లోకేశ్ ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం రాగానే యుద్ధ ప్రతిపాదికన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి వ్యవసాయానికి నీరు అందిస్తామని అలాగే స్థానికంగానే ఉపాధి దొరికే మార్గాలు చూపుతామని వలస కష్టాలు లేకుండా చేస్తామని అన్నారు.

సంపాదకీయం

అసత్యమే శరణ్యం

అబద్ధం ఆడితే గోడ కట్టినట్టు ఉండాలి అంటారు. ఈ విద్య ప్రధానమంత్రి మోదీకి, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు అబ్బినంతగా మరే రాజకీయ నాయకుడికీ ఒంటబట్టి ఉండదు. ఎన్నికల ప్రచార సభల్లో రాజకీయ నాయకుల ఉపన్యాసాలలో అతిశయోక్తులకు కొదవ ఉండదు. బూటకపు వాగ్దానాలకు అంతే ఉండదు. ఓట్లు రాబట్టడంకోసం వాగ్దానాల జడివాన కురిపిస్తుంటారు కనక శుష్క వాగ్దానాలకు అసత్యాలు కూడా తోడు కావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. కానీ సత్యాసత్యాల నిగ్గు తేల్చడానికి వీలున్న సందర్భాలలో కూడా అబద్ధం చెప్పాలంటే చాలా సాహసం కావాలి. అసత్యాన్ని సత్యంగా చెలామణి చేయడంలో బీజేపీ నాయకులు రాటుదేరి పోయారు. కర్నాటక శాసన సభ ఎన్నికలకు మే 10వ తేదీన పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం ఉన్న అధికారాన్ని నిలబెట్టుకోవడానికి బీజేపీ పడరాని పాట్లు పడ్తోంది. అయితే ఎన్నికలకు ముందు జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణలన్నీ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని కచ్చితంగా చెప్పకపోయినా బీజేపీ ఓటమి అనివార్యం అనే చెప్తున్నాయి. ముఖ్యమంత్రి బసవ రాజ్ బొమ్మై పని తీరు మీద బోలెడు ఫిర్యాదులున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత సర్వవ్యాప్తంగా కనిపిస్తోంది. బీజేపీకి మొట్టమొదట అధికారం రుచిచూపించిన కర్నాటకలోనే బీజేపీకి చుక్కెదురయ్యే పరిస్థితి ఉన్నప్పుడు ఎన్నికల గోదాలో విజయాలు సాధించడంలో ఆరితేరిన వారికైనా భయం పుట్టక మానదు. మంగళ, బుధవారాల్లో కర్నాటకలో ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కర్నాటకలో మత కలహాలు చెల రేగుతాయని హెచ్చరించారు.

2002లో గుజరాత్‌లో తగిన గుణపాఠం చెప్పినందువల్లే అక్కడ మతకలహాలు జరగడం లేదని అమిత్ షా చెప్పుకున్నారు. ఎవరికి గుణపాఠం చెప్పినందువల్ల గుజరాత్‌లో మత కలహాలు జరగడం లేదని అమిత్ షా అంటున్నారో విప్పి చెప్పనవసరం లేదు. కానీ కర్నాటకలో కాంగ్రెస్ విజయం సాధిస్తే మతకలహాలు చెలరేగుతాయని అమిత్ షా చెప్పడం ఎంత బూటకమో గణాంకాలను పరిశీలిస్తే తేలిపోతుంది. 2019 నుంచి కర్నాటకలో బీజేపీయే అధికారంలో ఉంది. కర్నాటకలో 31 జిల్లాలు ఉంటే 18 జిల్లాల్లో ఈ అయిదేళ్ల కాలంలో 163 సార్లు మతకలహాలు జరిగాయి. ఈ విషయం తెలియజేసింది మరెవరో కాదు. సాక్షాత్తు కర్నాటక హోం మంత్రే. అదీ శాసన మండలి సమావేశంలో చెప్పారు. నిండు సభలో చెప్పిన మాటను నమ్మకుండా ఉండలేం కదా! 2019 నుంచి ఇప్పటి వరకు 163 సార్లు మతకలహాలు జరిగితే అందులో అయిదింట మూడు వంతులు మల్నాడు జిల్లాలోని శివమొగ్గలోనే జరిగాయి. కర్నాటక హోం మంత్రి ఈ జిల్లానుంచే వచ్చారు. ఈ జిల్లా మత వైషమ్యాలకు చాలా కాలంగా నెలవుగా ఉంది. ఈ 163 సందర్భాలలో జరిగిన మతకలహాలలో 300 మంది పోలీసులు గాయపడ్డారు. మంగళూరు నగరం, దక్షిణ కన్నడ, గడగ్, శివమొగ్గలో మతకలహాలు చెలరేగాయని హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర శాసన మండలిలో ఒక ప్రశ్నకు లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలియజేశారు.

మత కలహాల సంఖ్య ఎక్కువగా నమోదు కావడానికి జ్ఞానేంద్ర ఒక సాకు కూడా వెతుక్కున్నారు. ఇంతకు ముందు మతకలహాలు జరిగితే చాలా వరకు అవి నమోదయ్యేవి కావని, ఇప్పుడు పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చినందువల్ల నమోదు పెరగడంతో మతకలహాల సంఖ్య పెరిగినట్టు కనిపిస్తోందని ఆయన తెలియజేశారు. పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చి ఉంటే క్రమంగా మతకలహాలు తగ్గి ఉండాలిగా! అదీ లేదు. 2019లో 16 సార్లు, 2020లో 19 సార్లు, 2021లో 32 సార్లు, 2022లో 96 సార్లు మత కలహాలు జరిగాయి. అంటే నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. శివమొగ్గలో 57 సందర్భాలలో, బాగల్ కోట్ లో 22 దఫాలు, దావణగేరేలో 18 సార్లు, కొడగులో 10 సార్లు, దక్షిణ కర్నాటకలో పదిసార్లు మతచిచ్చు చెలరేగింది. ఈ వివరాలన్ని గత ఏడాది సెప్టెంబర్ 15న హోం మంత్రి జ్ఞానేంద్ర సభా ముఖంగా తెలియజేసినవే. ముస్లింల మీద వ్యతిరేకత రెచ్చగొట్టడానికి బీజేపీ ఎన్ని ఎత్తులెత్తిందో స్పష్టంగానే కనిపిస్తోంది. హిజాబ్ గొడవకు కేంద్రం కర్నాటకేనని ఎలా మరిచిపోగలం. సభా ముఖంగా కూడా అసత్యం చెప్పడానికి భయపడని నాయకులు దండిగానే ఉన్నారు. మతోద్రిక్తతలను రెచ్చగొట్టే పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాను (పి.ఎఫ్.ఐ.) నిషేధించామని సదరు మంత్రి గొప్పగా చెప్పుకున్నారు. నిషేధం సవ్యంగా అమలుకావడం లేదనుకోవాలేమో. శివమొగ్గలో మత చిచ్చు ఆరని జ్వాలా గానే కొనసాగుతోందని మాజీ పోలీసు డైరెక్టర్ ఎస్.టి. రమేశ్ అంటున్నారు. ఆ ప్రాంతంలో మతకలహాలు పరిపాటేనట. కోస్తా ప్రాంతం, హుబ్బలి, బాగల్ కోట్, కల్బుర్గి లో హిందుత్వ కార్యకలాపాలు చాలా చురుకుగా సాగుతాయంటున్నారు ఆయన. మతకలహాలను ప్రేరేపించేది రాజకీయ నాయకులే. వాటివల్ల లబ్ధి పొందేదీ రాజకీయ పార్టీలే.

కర్నాటకలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమే 385 క్రిమినల్ కేసులను ఉపసంహరించింది. ఇందులో 182 కేసులు విద్వేష ప్రసంగాలకు సంబంధించినవే అంటే ప్రభుత్వం ఎవరి పక్షాన ఉందో అర్థం చేసుకోవచ్చు. అమిత్ షా కర్నాటకలో ఎన్నికల ప్రచారసభలో మాట్లాడడానికి సరిగ్గా రెండురోజుల ముందు ఓ ప్రముఖ దినపత్రిక ఈ గణాంకాలు వెల్లడించింది. ఈ క్రిమినల్ కేసులను వెనక్కు తీసుకోవడంవల్ల వెయ్యిమంది కేసుల జంఝాటం నుంచి బయటపడ్డారు. మాఫీ చేసిన కేసుల్లో మళ్లీ 182 కేసులు మతకలహాలకు సంబంధించినవే. మాఫీ అయిన కేసులు ఏ మతానికి చెందిన వారివో పరిశోధించి తేల్చుకోవలసిన అంశం ఏమీ కాదు. కేసుల మాఫీవల్ల లబ్ధి పొందిన వారిలో బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహ, ఎమ్మెల్యే రేణుకాచార్య కూడా ఉన్నారు. మాఫీ చేసిన 182 మత చిచ్చు సంబంధ కేసుల్లో 45 మితవాద వర్గం హింసకు పాల్పడిన సమయంలో మోపినవే. ఇవన్నీ 2017లో నమోదైన కేసులే. ఈ ఉదంతంలో 300 మంది మీద కేసులు మోపారు. ఉపసం హరించారు కనక అందరూ నిర్దోషులై పోయారు. చిక్ మగళూరులో గో సంరక్షకులకు సంబంధించిన కేసులు, కొడగు, మైసూరులో టిప్పుసుల్తాన్ జయంతి, శ్రీరామ నవమి, గణేశ్ ఉత్సవాలు, హనుమజ్జయంతి సందర్భంలో నమోదు చేసిన కేసులూ రద్దయి పోయాయి. ఈ సమయంలో కేసులు ఏ మతం వారిమీద నమోదై ఉంటాయో ఊహించుకోవచ్చు. ఇందులో మతాంతర వివాహాలు, మత మార్పిడులకు సంబంధించిన కేసులూ ఉన్నాయి. యుద్ధంలో మొదట బలయ్యేది సత్యమేనంటారు. ఎన్నికలయుద్ధంలో కూడా సత్యమే బలవుతోంది. ఎన్నికల్లో విజయం సాధించడానికి అసత్యాలో, అర్ధ సత్యాలో చెప్పడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ అమిత్ షా తరహా అసత్య ప్రచార ప్రభావం దీర్ఘ కాలంగా ఉంటుంది. విద్వేషం రెచ్చగొడ్తుంది.

మోదీ కొత్త రాగం

రా బావ ఏంటి ఈ రోజు ఏదో పాట పాడుతూ వస్తున్నావు. సరే ముందు కాఫీ తాగు తర్వాత పాడవచ్చు నా మాట విని నేను అన్నట్లుగా నీవు కూడా భక్తితో ఓ రామ శ్రీ రామ నీ నామమెంతో రుచిరా ఎంతో రుచి ఎంతో రుచిరా ఓ రామ అని నీవు కూడా స్నానం చేసి కాఫీ తాగకముందే నే చెప్పిన పదాలు వల్లె వెయ్యి నీ ఆరోగ్యం కుదుటపడుతుంది. నీ కోరికలన్నీ తీరిపోతాయి. హేతువాదుల మాట విని అనవసరంగా ప్రాణం మీదకు తెచ్చుకోకు. ఈ ఒక్కసారైనా నా మాట విను బావ. అదిసరే తెల్లవారే సరికి ఎంత భక్తుడివయ్యావు ఏం జరిగింది.

ఏం లేదు. మా యింటి దగ్గరలో చిన్న రామాలయం ఉంది. ప్రతి సంవత్సరం శ్రీరామనవమికి భజనలు చేయడం ఆరోజు భోజనాలు పెట్టడం పరిపాటి. ఈ సారి నవమి వెళ్లిపోయినా రోజూ గుడిలో భజనలు మానలేదు. ఎందుకని ఈ సంవత్సరం కొత్తగా ఏ మొచ్చింది అంటే అయోధ్యలో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన రామాలయం ప్రారంభమయ్యేవరకు ఇలాగే రోజూ భజనలు చేసి ఆ తరువాత ఈ భజన బృందం అయోధ్యకు వెళతారట. నిజమేదాన్ని పెద్దయాత్రాస్థలంగా మార్చే ఆలోచన బీజేపీకి ఉంది. అది కాదు మసీదులు పడగొట్టి రామాలయం కట్టకపోతే వేరే చోట కోరిన



విధంగా కట్టుకోవచ్చు గదా. నిజమే అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు ఎంత స్థలం కావాలన్నా ఇచ్చి వేరేచోట కట్టుకోమన్నా వినలేదు. మత కలహాలు నివారించడానికి ప్రధానిగా ప్రయత్నించాడు. అయితే ముస్లింలు గతంలోఉన్న హిందూ దేవాలయాలు కూల్చి వాటిపైనే మసీదులు నిర్మాణం చేశారనేది విశ్వహిందూ పరిషత్ బీజేపీ నాయకుల వాదన. కోర్టులో తేలే వరకు ఉండి మసీదు పడగొట్టి రామాలయం నిర్మించారు. అయితే పునాదుల కోసమని అవసరానికిమించి లోతు తవ్వారు. అడుగున రామాలయ ఆనవాళ్లకోసం తవ్వి ఉన్నారు. కాని అటువంటివి కనబడినట్లులేదు. అయినా అక్కడే కట్టాలనే పట్టుదల దేనికి? వాళ్లు పడగొట్టి మసీదు నిర్మించారు కనుక వీరు పడగొట్టి రామాలయం నిర్మించాలనే కక్షపూరిత చర్య. అంతకంటే ఏమీలేదు. అది సరే ఈ మధ్య ప్రధాని మోదీ కొత్తరాగం అలపిస్తున్నారేమిటి. ఆయనకు సప్త స్వరాలతో పాటు అన్ని రాగాలు వచ్చు. అవసరాన్ని బట్టి రాగం మార్చి ఆలపిస్తుంటారు. అందునా ఆరున్నర శృతిలో పాడగలడు. అది సరే ఇపుడా కొత్త రాగం ఏమిటంటావు.

నీవు పేపరు చూడలేదా. అయనకు బుద్ధుడు ఇపుడు గుర్తుకొచ్చి బుద్ధదేవుని బోధనలు ఆచరణీయం అంటున్నారు. అయితే కులమతాలు లేని సమసమాజాన్ని మోదీ అంగీకరిస్తాడా?. భలేవాడివి గుజరాత్ ముస్లింలను ఊచకోతకు కారణమైన మోది ఎలా అంగీకరిస్తాడు. రాజకీయాలతో అవసరానికి తగినట్లు మాట లుంటాయి. ఈ కొత్త రాగం ప్రస్తుతం కర్నాటక ఎన్నికలకు ఉపయోగ పడుతుంది. కాలానుగుణంగా అవసరాన్ని బట్టి రాగం,శృతి మారుతూ ఉంటుంది. బడుగుల పరామర్శకు వెడితే తీగను మీటి విషాదరాగాలు ఆలపిస్తాడు. నిజమేలే ఆర్ఎస్ఎస్ పునాదికదా ఆయనలో మార్పు ఎలా ఊహిస్తాం. భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చి హిందువులు మాత్రమే హిందూ దేశంలో ఉండాలనే రాగం మనసులో ఆలపిస్తూ బైటకు ఇటువంటి కొత్తరాగాలు వినిపిస్తారన్నమాట. మనుస్మృతిని మననం చేసుకుంటూ చాతుర్వర్ణ వ్యవస్థ స్థాపనకోసం పరితపిస్తూ ఎన్నికలకోసం, ప్రతిపక్షాలు నోరుమూయించడానికి అప్పుడప్పుడూ కొత్తరాగం ఆలపిస్తారు. నిజమే బావ ఆయనకు, అమిత్‌షాకు హిందుస్తాని రాగాలన్ని వచ్చు. వీరిద్దరూ కల్సి ప్రాక్టీసు చేసి దేశాన్ని పాలిస్తున్నారు. అది సరే బుద్ధుని బోధనలు ప్రవేశపెట్టడం మాట అటుంచి మూడవసారి గద్దెనెక్కితే మనుస్మృతి మన నెత్తిన బలవంతాన రుద్దకుంటే అంతేచాలు బావ. భలేవాడివయ్యా వాళ్ల ధ్యేయమే అది. వాళ్లకెపుడు వీలుపడుతుందా ఆ రాగం పాడటానికని సమయంకోసం వేచిచూస్తున్నారు. అదను చూచి ప్రవేశపెట్టి ప్రజల కోరికమేరకు అని ఆ రాగానికి తాళం జతచేయక మానరు. అనుకున్న దానికంటే ఎక్కువే మెజారిటీ ఇచ్చి ఎన్నుకున్న ప్రజల ఆశ అనే రాగం తీయకమానరు. మరి మనది సెక్యులర్ స్టేట్ కదా ఎలా వీలు పడుతుంది. ఇంకా నీ వెక్కడున్నావు. అంబేద్కర్ రాజ్యాంగం తుంగలో తొక్కి ఇష్టంలేక పోయినా నాలుగుచోట్ల అంబేద్కరు విగ్రహాలు నెలకొల్పివారు నమ్మిన మనువాదరాగం ఆలపించడం ఖాయం. స్లో పాయిజను అంటారే అలాగ ఈ సంవత్సరమే పిల్లల పాఠ్యపుస్తకాలలో మనువాద రాగాన్ని ప్రవేశపెడుతున్నారు. చిన్నతనంలోనే బుర్రకు ఎక్కించే ప్రయత్నం చేస్తున్నారుగ. సత్యభామ పాడినట్లు మీరజాలగలడా నా ఆనతి అని అదే రాగం అందుకోవడం ఖాయం. కర్నాటకలో వారి పాచికలు పారితే ఇంకా ఎవరాపగలరు. విజయగర్వంతో శ్రీ రాగం అందుకుంటారు. మరోసారి బీజేపీ గెలిస్తే కర్నాటకలో బసవన్న ప్రభావం సన్నగిలినట్లే.

సెల్: 9885569394

మే నెల-ఉపశ్రేణుల ఉద్యమాలకు ప్రేరణ కావాలి

డి.వి.వి.యస్. వర్మ

మే నెలకు ఒక ప్రత్యేకత వుంది. మే 1 - అంతర్జాతీయ కార్మిక దినోత్సవం. మే 5- కార్ల్ మార్క్స్ జయంతి. మే 9 - ఫాసిజం పై విజయం సాధించిన రోజు. వర్తమాన దేశ రాజకీయాల విశ్లేషణకు కొత్త తరహా ప్రజా ఉద్యమాలకు, నినాదాలకు ఇవి ప్రేరణ ఇస్తాయి. మే డే నాడు 8 గంటల పనిదినం కోసం సాగిన చికాగో పోరాటం, కార్మికుల రక్త తర్పణం గుర్తు చేసుకుంటారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి అన్న నినాదం ఇస్తారు. వాస్తవానికి ఈ రెండు మే డే ఉద్యమంలో పుట్టిన నినాదాలు కావు, దానికి ప్రేరణ ఇచ్చిన నినాదాలు. 1866లో మార్క్స్ సారథ్యంలో ఏర్పడిన మొదటి ఇంటర్నేషనల్ 8 గంటల పని దినాన్ని డిమాండ్ చేసింది. 1848లో మార్క్స్-ఏంగెల్స్‌లు రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక ముగింపు నినాదం "ప్రపంచ కార్మికులారా! ఏకం కండి!" దానికి ముందు "వారు గెలుచుకోడానికి ఓ ప్రపంచం వుంది" అన్న వాక్యం ఎంతో ప్రాముఖ్యత కలిగింది. ఇది దోపిడీలేని ప్రపంచాన్ని సాధించే కార్యాచరణకు ఇచ్చిన పిలుపు. ఎందుకో ఇది మే డే ప్రసంగాలలో, నినాదాలలో ప్రాధాన్యత లేనిదైంది. మే డే ఉద్యమం హక్కుల ఉద్యమంగా ప్రారంభమైనా ఆ నినాదాల వెనక దోపిడీ వ్యవస్థను కూల్చే రాజకీయం వుంది. దానికి కార్మిక వర్గాన్ని సంసిద్ధుల్ని చెయ్యాలి.

ప్రస్తుతం మన ముందు కొన్ని సవాళ్లు వున్నాయి. వాటిని పరిశీలించుకుందాం. 1. మనదేశంలో శ్రామిక వర్గం ఒకే రూపంలో లేదు. పారిశ్రామిక కార్మిక వర్గం కంటే వివిధ రంగాలకు విస్తరించిన అసంఘటిత కార్మికవర్గం అత్యధికంగా వుంది. బహురూపాలలో విస్తరిస్తున్న సేవారంగం వివిధ రకాల ఉద్యోగ బృందాలను సృష్టిస్తున్నది. మరో పక్క గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు, చాలా అనేక దొంతర్ల రైతులు వున్నారు. దీనికితోడు సమాజంలో వివక్ష వుంది. అణిచివేత వుంది. దళితులు, బహుజనులు, వివిధ మతాల మైనారిటీలు మహిళలు వున్నారు. వీరంతా ఒక పక్క దోపిడీకి, మరోపక్క వివక్షకీ గురౌతున్నారు. ఆంటోనియో గ్రాంసీ మాటల్లో ఇవన్నీ ఉపశ్రేణి తరగతులు ఈ ఉపశ్రేణులను ఐక్యం చెయ్యడం ఎలాఅన్నది మన మొదటి సమస్య. 2. రెండవ అంశం: ఈ ఉపశ్రేణులు గెలుచుకోవలసిన మరో ప్రపంచం, అంతరాలు లేని సమ సమాజం. అయితే ప్రస్తుతం దేశం నడక దీని విరుద్ధంగా వుంది. సంపద కొద్ది మంది దగ్గర మేటలు వేస్తున్నది. పేదరికం మరోచోట తిష్ట వేస్తున్నది. మోదీ 9 ఏళ్ల పాలనలో సంపద కేంద్రీకరణ శరవేగంతో సాగుతున్నది. 2013 నాటికి 60 మంది వున్న బిలియనీర్ల సంఖ్య ఇప్పుడు 119 కి పెరిగింది. 10 శాతం సంపన్నుల చేతిలో 77 శాతం దేశ సంపద పోగు పడింది. ప్రతి ఏటా పెరిగే సంపదలో 73 శాతం కేవలం 1 శాతానికి చేరిపోతున్నది. 67 కోట్ల మంది కేవలం 1శాతం సంపదను పంచుకుంటున్నారు.

దేశంలో విమానాశ్రయాలు, పోర్టులు, ఆయిల్‌నిక్షేపాలు, ఖనిజ సంపదను కార్పొరేట్లు వశం చేసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వరంగ సంస్థలన్నీ వారి పరం అవుతున్నాయి. వివిధపార్టీలు వీటిపై విమర్శలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నాయి. వాటిలో ప్రజలు భాగస్వాములు కావడంలేదు. ఇంతగా కార్పొరేట్లు దేశాన్ని దోచుకుంటున్నా ఈ శక్తులను సవాలుచేసే ప్రజాఉద్యమం రావడం లేదు. ఇది మరో పరిశీలనాంశం. మూడో అంశం: మోదీ పాలన ప్రజానుకూలం కాకపోగా ప్రజావ్యతిరేకమైంది. దేశానికి అచ్ఛేదిన్ రాలేదు. విదేశాలలో మూలుగు తున్న నల్లధనం తేలేదు. ప్రజలకు పంచలేదు. పెద్దనోట్లు రద్దుచేసి దేశంలో నల్లధనం వెలికి తీస్తానన్నది జరగలేదు. బ్యాంకుల దగ్గర క్యూలలో సామాన్యులు బారులు తీరారు. అక్కడే 200 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. జి.యస్.టీ తో ధరలు తగ్గుతాయన్న హామీ తిరగబడింది. నిత్యవసరాల ధరలు పెరిగాయి. పెట్రోలు, గ్యాస్ ధరలు ప్రతి ఇంటా మంటపెడుతున్నాయి. నిరుద్యోగం పెరిగింది. రైతుల ఆదాయం రెట్టింపు అన్నమాట అటకెక్కింది.

ఒకనాడు తాత్కాలికంగా ఉల్లిపాయల ధరలు పెరిగితే ప్రజలు ప్రభుత్వాలను మార్చేశారు. ఇప్పుడు అన్నీ పెరిగి జీవితం భారం అయినా ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయడం లేదు. పైగా దేశంలో జరుగుతున్న సర్వేల ప్రకారం మోదీయే ప్రధాని కావాలనుకునేవారు ఇప్పటికీ 52 నుండి 62 శాతం వున్నారు. ఇదీ మనం పరిశీలించుకుని తీరాల్సిందే. మోదీ బలం ఆయన ఆర్థిక విధానాలలో లేదు. పరిపాలనాదక్షతలో లేదు. మోదీ నడుపుతున్న రాజకీయంలో వుంది. తనకు తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. భారత జాతీయవాదం దేశపౌరులందరినీ సమానంగా చూస్తుంది. హిందూ జాతీయవాదం ఈ దేశం హిందువులది మాత్రమేనని ఇతరులంతా పరాయివారుగా విభజిస్తుంది. విద్వేష రాజకీయాన్ని సాగిస్తుంది. ఈ భావజాలమే దేశానికి ఒక ఉక్కు మనిషిని అవసరం చేస్తుంది. ఒక హీరోని ముందుకు తెస్తుంది. భక్తులనీ, ఉన్మాదులను తయారు చేస్తుంది. ఈ అగ్గి చల్లారకుండా రోజుకొక మతవివాదాన్ని ముందుకు తెస్తారు. ఒక మందిరం తర్వాత మరొక మందిరం, ఒక కట్టడం తర్వాత మరో కట్టడం, ఒక పేరు మార్పిడి తర్వాత మరొకటి, చరిత్రను తిరగరాయడం, పురాణాలే చరిత్రలుగా ప్రకటించడం మనువాదమే. మన రాజ్యాంగం అనే వివాదాలే నిత్య ఎజెండాగా ఉంది. పార్టీల స్పందనలు దీని చుట్టూ సాగుతాయి. నిత్య చర్చల పేరుతో మీడియా ఈ విద్వేషాన్ని రోజువారీ టానిక్కుగా ప్రజలకు అందిస్తాయి. ఇలాంటి ఉన్మాదం, విద్వేషం ప్రజల తలకెక్కితే నిత్యజీవిత సమస్యలు తెరమరుగౌతాయి.

ఇదే మోదీకి బలంగా మారుతున్నది. ప్రశ్నించేవాడు దేశద్రోహి అవుతాడు. కాదన్నవాడు జైలుపాలవుతాడు. అన్ని రకాల ఫాసిస్టు పద్ధతులకు ద్వారాలు తెరుచుకుంటాయి. దీనిని ఎదుర్కోవడం ఎలా అన్నది మరో కీలక అంశం. మనం మూడు అంశాలను ప్రస్తావించుకున్నాం. వాటికి ఆచరణయోగ్యమైన సమాధానాలను అందరూ ఆలోచించాలి. 1. ఉపశ్రేణుల ఐక్యత: ఈ ఉప శ్రేణుల ఐక్యతను సాధించకుండా రాజకీయరంగంలో ఆశించిన మార్పులు రావు. ఇవి వృత్తిపరంగా భిన్నమైనవి. పట్టణ-గ్రామీణ ప్రాంతాలు నివాస పరంగా భిన్నమైనవి. వివక్షకు గురి కావడంలోనూ భిన్నమైనవి. వీటి మధ్య ఎంతోవైవిధ్యం. ఎన్నో వైరుధ్యాలు కనిపిస్తాయి. పట్టణాలలో, గ్రామాలలో కింది స్థాయి నుండీ యీ శ్రేణుల మధ్య ఐక్యతకు ప్రయత్నాలు జరగాలి. ఒకరి సమస్యలపై మరొకరి సహకారం ఈ ఐక్యతకు పునాది అవుతుంది. ఇదిమాత్రమే సరిపోదు. ఈ ఉపశ్రేణులన్నింటి ఆకాంక్షలను వక్తీకరించేదీ, వారి జీవితాలకు కొత్తరూపును ఇచ్చే ఒక కొత్త నినాదాన్ని రూపొందించ గలగాలి. అలాంటి ఆచరణయోగ్యమైన నినాదం మాత్రమే వారి మధ్యగల వైరుధ్యాలను వెనక్కినెట్టి ఐక్యతకు దారి తీస్తుంది. దీనిని రూపొందించగలిగితే అది వ్యవస్థ మీద పోరాడే గొప్ప ప్రజా ఉద్యమానికి ప్రేరణ అవుతుంది.

2. పోగుపడ్డ సంపద పునఃపంపిణీ: ఒక నినాదం ప్రజా ఉద్యమంగా విజయం సాధించాలంటే ఆ నినాదం సమంజసమైనదేనని ప్రజలు భావించాలి. దానిని అమలు లోకి తెచ్చే మార్గాలు ఆచరణ సాధ్యమేనన్న నమ్మకం కలగాలి. దానివల్ల తమ జీవితాలు ఎలా మారతాయో వారికి స్పష్టంగా కనిపించాలి. కార్పొరేట్ల సంపద అంతా దోచుకున్న శ్రమే. అదే వారిదగ్గర పోగుపడ్డ సంపద. దానిని జాతిపరం చెయ్యడం సమంజసమే. ప్రస్తుతం దానిలో కొంత భాగమైనా తక్షణం పంపిణీ జరగాలి. ఇది మనకి కొత్తకాదు. ఒక పరిశ్రమ యజమాని దగ్గర లాభంగా పోగుపడ్డ శ్రమలో ఒక భాగాన్ని బోనస్‌గా పంపిణీ చెయ్యడం లాంటిదే. ఇతర దేశాలలో వలే మన దేశంలో కూడా తగిన స్థాయిలో కార్పొరేట్‌ల సంపదమీద, వారసత్వ ఆస్తి బదలాయింపు మీద పన్ను విధించాలి. తగ్గించుకుంటూ వస్తున్న కార్పొరేట్ పన్నును పెంచాలి. ఇలాంటి పన్నులు విధిస్తే ఆక్స్‌ఫామ్ సంస్థ అంచనాల ప్రకారం పునఃపంపిణీకి వచ్చే సొమ్ము లక్షల కోట్లలో వుంటుంది. దీనిని ఉపశ్రేణులకు వారి జీవితాలను మార్చే విధంగా పంపిణీ చెయ్యాలి. రాజ్యాంగం ప్రకారం అందరికీ జీవించే హక్కు వుంది. ప్రతి కుటుంబానికి హక్కుగా నివాసం, హక్కుగా ఉచిత ఆరోగ్యవైద్య సదుపాయం, హక్కుగా పిల్లల చదువు, వృద్ధులకు పెన్షన్లు, గౌరవంగా జీవించడానికి ప్రతి కుటుంబానికి నగదు బదిలీని ప్రకటించాలి. యువతకు ఉపాధి హక్కు లేదా నిరుద్యోగ భృతి, రైతుల పంటనంతా మద్దతు ధరకి కొనుగోలుచేసే రైతు మార్కెట్ వ్యవస్థ ఏర్పాటు వగైరాలు సాధ్యమౌతాయి. సంపద పునః పంపిణీ నినాదం ఉపశ్రేణుల ఉమ్మడి నినాదం అవుతుంది. ఐక్య ఉద్యమానికి ప్రేరణ అవుతుంది. 3. ఫాసిజంపై సాంస్కృతిక ఉద్యమం: మోదీ అనుసరిస్తున్న విద్వేష రాజకీయం, ఉన్మాద రాజకీయం, ఫాసిస్టు భావజాలం పౌరసమాజంలోని అత్యధికుల లోకజ్ఞానంలో భాగంఅయింది. దీనిని విచక్షణాజ్ఞానంగా మార్చడం కేవలం నినాదాలతో సాధ్యపడేది కాదు. మన పౌరసమాజంలో ఒకగొప్ప భావ జాల సంఘర్షణ జరగాలి. వ్యక్తుల బుర్రలనుండి, సమూహాల చైతన్యంలో చొరబడ్డ మనువాద ఆధిపత్య భావజాలాన్ని, తొలగించడానికి తగిన సాంస్కృతిక సంఘర్షణ జరగాలి. లేకపోతే ప్రజాస్వామ్య భావజాలం మనుగడ సాగించలేదు. మే నెలలో నిర్వహించే కార్యక్రమాలు-ఉపశ్రేణుల ఐక్యతకి, సంపద పునః పంపిణీ ఉద్యమానికి, ఫాసిస్టు విద్వేష భావజాలంపై సాగించే ప్రగతిశీల సాంస్కృతిక ఉద్యమానికి ప్రేరణ ఇచ్చేవిగా వుంటాయని ఆశిద్దాం.

దారి దీపం సంపాదకులు, సెల్: 8500678977

డార్విన్ సిద్ధాంతం తొలగింపు తగదు

డాక్టర్ సోమ మర్ల

మానవ పరిణామ క్రమాన్ని తెలుసుకొని తార్కిక జ్ఞానాన్ని సంతరించుకునేందుకు డార్విన్ మానవ పరిణామ సిద్ధాంతం మహత్తరమైంది. ఈ సిద్ధాంతాన్ని సిబిఎస్ఇ పదవ తరగతి సైన్సుపాఠ్యాంశాల నుండి ఎన్‌సిఇఆర్‌టి తొలగించడంపై 1800 మందికి పైగా శాస్త్రవేత్తలు, మేధావులు గతవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం ఈ నిర్ణయాన్ని ఉపసంహించుకోవాలని వీరు ఎన్‌సిఇఆర్‌టికి లేఖ రాసారు. "శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించుకునేందుకు మానవ పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడం అత్యంత కీలకం". విద్యార్థులను విజ్ఞానవంతులను చేసే అవకాశాన్ని ఇవ్వకపోడం "విద్యా వ్యవస్థను అవహేళన" చేయడం అవుతుంది. పాఠ్యాంశాల నుండి చార్లెస్ డార్విన్ సిద్ధాంతాన్ని మానన పరిణామంలో చుట్టరికపు సంబంధాల గుర్తింపు, సూక్ష్మజీవుల తీరు తెన్నులులాంటి విషయాలను తొలగించారు. ఇది అత్యంత విచారకరం. పాఠ్యాంశాల నుండి ముఖ్యంగా మానవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడంపై శాస్త్రవేత్తలు, మేధావులు తీవ్ర నిరసన వ్యక్తంచేస్తూ తక్షణం తొలగించిన పాఠాలను తిరిగి చేర్చాలని వారు డిమాండ్ చేశారు. లేఖపై సంతకం చేసినవారిలో ఐఐటి కాలేజీలు, ఐఐఎస్ఇఆర్, ఐసిఎఆర్, టిబిఎఫ్ఆర్, సిఎస్ఐఆర్‌లాంటి సుప్రసిద్ధ కాలేజీలకు చెందిన శాస్త్రవేత్తలు, మేధావులున్నారు. చాలా కేంద్ర విశ్వవిద్యాలయాల నుండి ప్రొఫెసర్లు సంతకాలు చేశారు. జీవశాస్త్రాన్ని అర్థం చేసుకోవాలంటే జీవశాస్త్ర పరిణామక్రమాన్ని అధ్యయనం చేసి తగినంత విజ్ఞానం తప్పనిసరి. జీవుల మనుగడ ప్రకృతిలో ఆమె లేదా ఆయన స్థానం అర్థం చేసుకోవడం కూడా జీవశాస్త్రం అధ్యయనానికి ముఖ్యమైనవి. సమాజంలో నిత్యం మనం ఎదుర్కొనే అనేక సమస్యలను విశ్లేషించుకోవడానికి, అలాగే అంటువ్యాధులు, పర్యావరణం, వాతావరణం, ఔషధాల ఆవిష్కరణలాంటి వాటికి పరిణామక్రమ జీవశాస్త్ర అధ్యయనం ఎంతో అవసరం.

ఇటీవల తలెత్తిన కోవిడ్ మహమ్మారి రోగలక్షణ శాస్త్రంలో జన్యువుల విశ్లేషణలో ప్రకృతి చాలా కీలకమైనపాత్ర నిర్వహించిందని రోజువారీ జీవనంలో రద్దీగా ఉండటం వల్ల గుర్తించలేకపోయాము. ఇది క్రమంగా పరివర్తనం చెందింది. శాస్త్ర పరిశోధనలు ఈ అంటు వ్యాధి మరింతగా విస్తరించకుండా నియంత్రించడానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. జన్యుపరిణామ క్రమం అధ్యయనం మూలంగా రోగాణువులలో వ్యాధులకు గురవుతున్న జన్యువులు, ఎంజైములను అర్థం చేసుకొనేందుకు ఉపయోగం కలిగింది. తద్వారా లక్షలాది మంది ప్రాణాలను కాపాడుకోవడం సాధ్యమైంది.

మన విశ్వం అనేకరకాల జీవజాతులు, పశు పక్ష్యాదులు, మొక్కలు, సూక్ష్మ జీవులతో కూడిన ఎంతో వైవిధ్యభరితమైంది. జీవవైవిధ్యాన్ని, వివిధజాతుల మధ్య ప్రస్తుతం ఉన్న సంబంధాలను అర్థం చేసుకునేందుకు శాస్త్రవేత్తలు సహాయపడ్డారు. అలాగే హైబ్రిడ్ సంబంధిత మొక్కలు అవిష్కరించడానికి శాస్రవేత్తల కృషి ఎనలేనిది. ఫలితంగా పంటల దిగుబడి పెరిగింది. మేలైన పంటలు వేసేందుకు ఆహార ఉత్పత్తిని పెంచేందుకు విశ్వంలో జీవులన్నిటినీ ఆకలికి గురికాకుండా మనుగడ

సాధించేందుకు శాస్త్రవేత్తలు ఉపయోగపడ్డారు. వివిధ జీవుల పుట్టుకను డార్విన్ సిద్ధాంతం మనకు తెలియజేసింది. వివిధరకాల మొక్కలు, జంతువులను గురించి ఈ సిద్ధాంతం తెలియజెప్పింది. వాతావరణంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి కొన్నిరకాల జీవులు క్రమంగా మార్పునకు లోనయ్యాయి. అన్నిరకాల క్రిమికీటకాలలో ఒకేరకమైన డిఎన్‌ఏ లేదా ఆర్ఎన్ఏ, జీవక్రియ, శరీరధర్మ, ఉమ్మడి జన్యువారసత్వం (జీవపటలం) గురించి జీవశాస్త్రం మనకు తెలియజేస్తుంది. కొత్త యుగాన్ని ఆవిష్కరించిన డార్విన్ ప్రతిపాదించిన పరిణామ సిద్ధాంతం మూలంగా జీవశాస్త్రంలో జన్యువుల ఉనికి స్థిరపడింది. అనంతరం వివిధ జంతువుల మధ్యగల పోలికలు, సంబంధాలను గురించి తెలుసుకునేందుకు ఈ సిద్ధాంతం ఉపయోగపడింది. ఫ్రెడరిక్ ఎంగెల్స్ తన వ్యాసం "కోతి మానవుడిగా రూపాంతరం చెందడానికి శ్రమ నిర్వహించిన పాత్ర" లో ప్రస్తుత ఆధునిక మానవుడిగా పరిణామం చెందడంపై విశ్లేషణ చేశారు. ఈ పరిణామక్రమంలో మానవుని శ్రమ పాత్రను ఆయన ప్రశంసించారు.

పరిణామ క్రమంపై ప్రపంచమంతా ఉన్న అవగాహనకు పూర్తి విరుద్ధంగా బీజేపీకి చెందిన కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మాజీ మంత్రి సత్యపాల్(జనవరి 2018) డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని సవాలు చేశారు. అంతేకాదు, "కోతులు మనిషిగా మార్పుచెందుతుంటే ఎవరూ చూడలేదు" అలాగే డార్విన్ సిద్ధాంతం (మానవ పరిణామం శాస్త్రబద్ధంగా తప్పు అని కూడా సత్యపాల్ చెప్పారు. విద్యార్థుల పుస్తకాల్లో పాఠ్యాంశాలను మార్చివేయవలసిన అవసరం ఉందని కూడా ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో పాఠ్యపుస్తకాల నుండి డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని, రేఖా గణితాన్ని తొలగించి వీటి స్థానంలో పుక్కిటి పురాణాలలో భాగమైన దశావతారాలను ప్రవేశపెట్టారు. వేదగణితాన్ని కూడా ప్రవేశపెట్టినా ఆశ్చర్యపడవలసిన అవసరంలేదు. ఆర్ఎస్ఎస్ ప్రస్తుతం కేంద్రంలోఉన్న ప్రభుత్వం సైన్సును, తార్కిక ఆలోచనను లక్ష్యంగా చేసుకున్నారు. తద్వారా విమర్శనాత్మక ఆలోచనను, విద్యార్థులు ప్రశ్నించడానికి వీలులేని విధంగా మార్పు చేసేందుకు పూనుకున్నారు.

ఆధునిక భారతదేశాన్ని అజ్ఞానం, మనుస్మృతి, కులతత్వం ఉన్న చీకటి యుగాలకు తీసుకువెళ్లాలని వీరు పథకాన్ని రూపొందించుకున్నారు. ఇది ఎంత మాత్రం సరైందికాదని పాఠ్యాంశాల నుండి తొలగించిన పాఠాలన్నింటినీ తిరిగి చేర్చాలని దాదాపు 1800 మందికిపైగా ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు డిమాండ్ చేశారు. వీరితోపాటు ప్రజలు కలిసి తొలగించిన పాఠ్యాంశాలను తిరిగిచేర్చాలని ఎన్‌సిఆర్‌టీని, కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖను డిమాండ్‌చేస్తూ పోరాటం చేయవలసిన అవసరం ఉంది.

వ్యాస రచయిత ఐసిఎఆర్‌లో (న్యూఢిల్లీ) జినోమిక్స్ హెడ్, ప్రిన్సిపల్ సైంటిస్ట్(రిటైర్డ్)

నక్సల్స్‌పై పోరు ఉధృతం

అమరుల త్యాగాలు వృధాకావు

బాధిత కుటుంబాలను ఓదార్చిన సీఎం బాఘెల్

దంతెవాడ: జవాన్ల ప్రాణత్యాగాలు వృధా కాబోవని, నక్సలైట్లపై పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ చెప్పారు. నక్సల్స్ బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల భౌతిక కాయాలను సీఎం బాఘెల్ గురువారం సందర్శించారు. అమరులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. బాధిత కుటుంబాలను ఆయన ఓదార్చారు. జవాన్ల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా విషాదంగా మారింది. మహిళలు, పిల్లలను ఆపడం ఎవరితరం కావడం లేదు. మహిళా భద్రతా సిబ్బంది బాధిత కుటుంబాలను ఓదార్చడానికి శ్రమించారు. జవాన్ల భౌతికకాయాలను ప్రత్యేక వాహనాల్లో ఇక్కడి నుంచి సొంతూళ్లకు తరలించారు. సీఎం బాఘెల్ స్వయంగా ఓ జవాను శవపేటికను తన భుజాలపై మోసుకెళ్లి వాహనంలో ఎక్కించారు. నక్సల్స్ పేల్చిన బాంబుల దెబ్బకు 10 మంది జిల్లా రిజర్వు గార్డు(జీఆర్‌డీ) సిబ్బంది, ఓ డ్రైవరు బుధవారం చనిపోయిన విషయం విదితమే. 40 కేజీల

పేలుడు సామగ్రితో కూడిన ఐఈడీ బాంబును నక్సల్స్ పేల్చారు. బాంబు పేలుడు ధాటికి రోడ్డుపై 10 అడుగుల గుంట పడింది. పేలుడుకు సంబంధించిన దృశ్యాలు సైతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. కర్లీలోని పోలీస్ లైన్స్‌లో ఉంచిన జవాన్ల భౌతికకాయాలను సీఎం బాఘెల్, హోంమంత్రి తమ్రాధ్వజ్ సాహు, ఎంపీలు దీపక్ బైజ్, ఫులోదేవి నేతం, డీజీపీ అశోక్ జునేజా సందర్శించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. జవాన్ల కుటుంబ సభ్యులను బాఘెల్ పరామర్శించి...ఓదార్చారు. అనంతరం బాఘెల్ విలేకరులతో మాట్లాడుతూ అమరుల త్యాగాలు వృథాకాబోవని, నక్సల్స్‌పై పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని స్పష్టంచేశారు. నక్సలైట్లపై మన జవాన్లు ధైర్యంగా పోరాడుతున్నారని, గడచిన నాలుగేళ్లలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 75 భద్రతా శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. అంతకుముందు పరిమిత ప్రాంతాల్లోనే శిబిరాలు ఉండేవన్నారు. రోడ్ల నిర్మాణం ఇప్పుడు అద్భుతంగా జరిగాయని, జవాన్ల ప్రయాణానికి ఇప్పుడు ఇబ్బందులేవీ లేవని సీఎం చెప్పారు. బస్తర్ డివిజన్‌లోని మారుమూల ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. పోలీసు శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. నక్సల్స్ వెనకడుగు వేశారన్నారు. రెండేళ్ల తర్వాత ఇలాంటి దాడి జరిగిందని, అయినా ఇది తమను తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని అన్నారు.

కొత్త న్యాయమూర్తుల నియామకం

న్యూదిల్లీ: దిల్లీ సహా నాలుగు హైకోర్టుల్లో 11 మంది న్యాయ అధికారులు, ఇద్దరు న్యాయవాదులు అదనపు న్యాయమూర్తులు, న్యాయమూర్తులుగా గురువారం పదోన్నతి పొందారు. పాట్నా హైకోర్టు నుంచి జస్టిస్ సంజీవ్ ప్రకాశ్ శర్మ పంజాబ్-హరియాణా హైకోర్టుకు బదిలీ కాగా, మధ్యప్రదేశ్ హైకోర్టుకు చెందిన జస్టిస్ అతుల్ శ్రీధరన్ జమ్మూకశ్మీర్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. కాగా చత్తీస్‌గఢ్, దిల్లీ, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ హైకోర్టుల్లో 13 తాజా నియామకాలు జరిగాయి. ఈ మేరకు నియామకాలు, బదిలీలపై న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు ట్వీట్ చేశారు. దిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా రెండేళ్ల కాలానికి గిరీశ్ కథ్‌పాలియా, మనోజ్ జైన్ నియమితులయ్యారు. అలాగే రూపేష్ చంద్రవర్షిణి, అనురాధ శుక్లా, సంజీవ్ సుధాకర్ కల్గాంకర్, ప్రేమ్ నారాయణ్ సింగ్, అచల్ కుమార్ పలివాల్, హిర్దేశ్, అవనీంద్ర కుమార్ సింగ్‌లు మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా, ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తులుగా రాకేశ్ తప్లియాల్, పంకజ్ పురోహిత్, వివేక్ భారతీ శర్మలు నియమితులయ్యారు. కాగా చత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా సంజయ్ కుమార్ జైస్వాల్ పదోన్నతి పొందారు. అదనపు న్యాయమూర్తులు సాధారణంగా రెండు సంవత్సరాల పాటు న్యాయమూర్తులుగా నియమించబడతారు లేదా వారిని శాశ్వత న్యాయమూర్తులు అని పిలుస్తారు.

ప్రత్యేక రిజర్వేషన్ల కోసం జాతీయ రహదారి దిగ్బంధం

జైపూర్: ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ గత కొద్దిరోజులుగా భరత్‌పూర్‌లో జైపూర్-ఆగ్రా జాతీయ రహదారిని మాలి సంఘం సభ్యులు దిగ్బంధించారు. దాని నాయకుడు మురారి లాల్ సైనీ నేతృత్వంలోని సంఘ ప్రతినిధి బృందం మంగళవారం ఇక్కడ రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్‌ను ఆయన నివాసంలో కలిసింది. అయితే నిరసనకారులు ఇంకా జాతీయ రహదారిని ఖాళీ చేయలేదు. కోటా సమస్యపై నిరసన స్థలానికి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘానికి చెందిన వ్యక్తిని పోస్ట్‌మార్టం చేయడానికి నిరసనకారులు ఇంకా అనుమతించలేదని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించారని, నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫూలే రక్షణ సంఘర్ష్ సమితి కన్వీనర్ అయిన సైనీ మాట్లాడుతూ... 'మా డిమాండ్లను పరిశీలించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది' అని అన్నారు. అయితే, నిరసన స్థలంలో ఉన్న సంఘం సభ్యులు ఆందోళన విరమించే నిర్ణయం ఇంకా తీసుకోలేదని ఆయన అన్నారు. తమ నిరసనను విరమించేందుకు సంఘం సభ్యులతో చర్చలు జరుపుతున్నారు. ఓబీసీ కేటగిరీలోకి వచ్చే మాలి కమ్యూనిటీకి చెందిన సభ్యులు ప్రత్యేకంగా 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రత్యేక లువ్‌కుష్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీలోని పిల్లలకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. టెంట్‌లలో క్యాంప్ చేస్తున్న ఆందోళనకారులు అరౌడా గ్రామ సమీపంలోని ఎన్‌హెచ్-21లో సుమారు కిలోమీటరు మేర రోడ్డుపై రాళ్లను వేసి రాకపోకలను అడ్డుకున్నారు. దీంతె జైపూర్-ఆగ్రా మధ్య రాకపోకలు సాగించే వారి కోసం, రద్దీని నివారించడానికి ట్రాఫిక్‌ను మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

బీజేపీతో పొత్తు ఆగదు: పళనిస్వామి

న్యూదిల్లీ/చెన్నై: బీజేపీతో తమ పొత్తు కొనసాగుతోందని, బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో తమకు ఎలాంటి సమస్యలేదని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి గురువారం చెప్పారు. బీజేపీ, అన్నాడీఎంకే మధ్య వైరుధ్యాలు పెరిగాయంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో పళనిస్వామి ఈ వ్యాఖ్యలు చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసే పోటీ చేశాయి. దిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయిన మరుసటి రోజు పళనిస్వామి చెన్నైలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో కుదుర్చుకున్న పొత్తు 2021 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగిందని, ఈరోడ్ ఉప ఎన్నికలోనూ కలిసే పోటీ చేశామని, ఈ పొత్తు ఇప్పుడూ కొనసాగుతుందని పళనిస్వామి చెప్పారు. అన్నామలైతో తమకు ఎలాంటి సమస్యలు లేవని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇద్దరి మధ్య వైరుధ్యాలు ఉంటే ఈరోడ్ ఉప ఎన్నికల్లో ఆయన ఎందుకు ప్రచారం చేస్తారని అడిగారు. తమ మధ్య వైరుధ్యాలు సృష్టించడానికి మీడియానే ఇలాంటి ప్రశ్నలు అడుగుతుందన్నారు.

రెండు కోట్లు దాటనున్న పర్యాటకుల సంఖ్య

జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా

వైద్య కళాశాల, ఆసుపత్రికి శంకుస్థాపన



శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య ఈ ఏడాది రెండు కోట్ల కంటే ఎక్కువగానే ఉండవచ్చని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్నారు. కేంద్ర పాలిత ప్రాంతం గతేడాది నెలకొల్పిన ఆల్ టైమ్ రికార్డు బద్దలవుతుందన్నారు. 300కుపైగా చిత్రాల షూటింగులు గతేడాది జరిగాయని, ఈ ఏడాది ఆ రికార్డునూ తిరగరాస్తామని విశ్వాసంగా చెప్పారు. సిన్హా గురువారం కశ్మీర్‌లో వైద్య కళాశాల, ప్రైవేటు ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గతేడాది 1.88 కోట్ల మంది జమ్ముకశ్మీర్‌ను సందర్శించారు. ఈ ఏడాది పర్యాటకులకు సంబంధించిన రికార్డులు బద్దలవుతాయి అని అన్నారు. మా రికార్డులను మేము బద్దలు కొట్టడమే మాకున్న సమస్య అంటూ చమత్కరించారు. 'ప్రభుత్వ రంగానికి చెందిన పెద్ద ఆసుపత్రులు, కళాశాలలు ఉన్నాయిగానీ ప్రైవేటు ఆసుపత్రులు, కళాశాలు ఆ స్థాయిలో లేవు. ఇప్పుడు ఆ శూన్యత భర్తీ అయింది. వెయ్యి పడకల ఆసుపత్రి, 150 సీట్ల వైద్య కళాశాలను నెలకొల్పుతున్నట్లు అభినందిస్తున్నా' అని సిన్హా అన్నారు. 'కశ్మీర్‌లో కళాశాల రావడంతో స్థానిక విద్యార్థులు వైద్య విద్య కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఇది కొత్త ఆరంభం. ఇక పెట్టుబడులు పెరుగుతాయి. ఉపాధి అవకాశాల సృష్టి జరుగుతుంది. జమ్ముకశ్మీర్‌ను ప్రగతిపథంలో ముందుకు తీసుకెళుతున్నాం' అని సిన్హా అన్నారు.

గుజరాత్‌లో 1 నుంచి కాంగ్రెస్ 'జన్ మంచ్'

బీజేపీ ప్రభుత్వ అవినీతి, ప్రజాసమస్యలపై గళమెత్తడమే ఉద్దేశం

అహ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీ గుజరాత్ శాఖ 'జన్ మంచ్' కార్యక్రమాన్ని మే ఒకటో తేదీ నుంచి చేపట్టబోతోంది. మరింతగా ప్రజల్లోకి వెళ్లడం, వారి సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషిచేయడం, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వ అవినీతి బాగోతాలను బహిర్గతం చేయడమే జన్ మంచ్ ముఖ్యఉద్దేశంగా పార్టీశాఖ తెలిపింది. పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మే 1న జన్‌మంచ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, ఇదే క్రమంలో పార్టీ నేతలు అన్ని తాలూకాలలో పర్యటిస్తారని గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ గుజరాత్ నేత అమిత్ చావ్డా తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై గళమెత్తే అవకాశాన్ని జన్ మంచ్ కల్పిస్తుందని అన్నారు. ప్రజాసమస్యలను సముచిత ఫోరాల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా వాటిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ కృషిచేస్తుందని చెప్పారు. అసెంబ్లీలోనూ వీటిని లేవనెత్తుతామన్నారు. నిరుద్యోగులు, రైతులు, పన్ను చెల్లింపుదారులు, మహిళలు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రస్తుత బీజేపీ పాలనలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, అధికార పక్షానికి ప్రజా సమస్యలను పట్టించుకునే తీరికే లేదని పార్టీ సీనియర్ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వానికి పండుగల జరుపుకోవడం నుంచి తీరిక లేదని, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతోందని, పంట నష్టానికి సముచిత పరిహారం రైతులకు అందడం లేదని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, సంఘవిద్రోహ శక్తులపై పోలీసుల చర్యలు లోపించాయని, ఉపాధి కల్పన లేదని అమిత్ తెలిపారు. ఈ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే వేదికే 'జన్ మంచ్' అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గుజరాత్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్ ఠాకూర్ మాట్లాడుతూ 2022, డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో 182 స్థానాలున్న అసెంబ్లీలో 156 స్థానాలను బీజేపీ గెలుచుకుంది. దీంతో మరింత అహంకారం పెంచుకుంది. అసంతృప్తి గళాలను అణచివేస్తోంది. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తంచేసే పరిస్థితి ప్రజలకు లేదు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి రాతపూర్వకంగా వినతులు స్వీకరిస్తామని, వాటిని సంబంధిత యంత్రాంగాల వద్దకు తీసుకెళ్లి ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే లక్ష్యంతో పోరాడతామన్నారు.

బీజేపీ 40శాతం కమీషన్ సర్కారును ప్రజలే అంతం చేస్తారు: కాంగ్రెస్

న్యూదిల్లీ: బీజేపీ 40 శాతం కమీషన్ సర్కారును అంతం చేస్తామని కర్నాటక ప్రజలు మే10న జరిగే ఎన్నికల్లో హామీ ఇస్తారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. కాంగ్రెస్ హామీలు బూటకమన్న ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలపై ఆ పార్టీ విరుచుకుపడింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్విట్టర్ ద్వారా మోదీ వ్యాఖ్యలపై స్పందిస్తూ... 'అమిత్ షా, యోగి తర్వాత ఇప్పుడు నిరాశతో దారుణ వ్యాఖ్యలు చేయడం మోదీ వంతు. మే 10న, కర్నాటక ప్రజలు బీజేపీ 40% కమీషన్ సర్కారును అంతం చేస్తారని హామీ ఇస్తారు. కొన్ని రోజుల తర్వాత కాంగ్రెస్ హామీలు రాజస్థాన్, చత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్‌లో మాదిరిగా అమలు చేయబడతాయి' అన్నారు. అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి అమలు చేసిన పథకాలను వివరించారు. ఈ మేరకు ఆయన గురువారం వరుస ట్వీట్లు చేశారు. 'రాజస్థాన్ ప్రభుత్వ వాగ్దానాలు నెరవేర్చబడ్డాయి: పాత పెన్షన్ పథకం అమలు, ఇందిరా గాంధీ పట్టణ ఉపాధి-125 రోజుల పని, ఆరోగ్య హక్కు- ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత అత్యవసర చికిత్స, చిరంజీవి యోజన: ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.25 లక్షల బీమా, రూ.10 లక్షల ప్రమాద బీమా' అని రమేశ్ పేర్కొన్నారు.

పూంచ్ ఉగ్రదాడిపై మౌనమేమిటి?

మోదీ సర్కార్‌కు కాంగ్రెస్ ప్రశ్న

న్యూదిల్లీ: పూంచ్ ఉగ్రదాడిపై మోదీ ప్రభుత్వ మౌనాన్ని కాంగ్రెస్ పార్టీ గురువారం ప్రశ్నించింది. జమ్ముకశ్మీరులో ఇటీవలకాలంలో అనేక ఉగ్రదాడులు జరిగాయని, ఇది దేశ భద్రతను ప్రమాదంలోకి నెట్టాయని విమర్శించింది. జమ్ముకశ్మీరులోని పూంచ్‌లో ఏప్రిల్ 20న ఉగ్రదాడి కారణంగా సైనిక వాహనానికి నిప్పంటుకొని ఐదుగురు జవాన్లు మృతి చెందారు. అనేకమంది గాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మీడియా విభాగం అధిపతి పవన్ ఖేరా ఇక్కడి ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పూంచ్‌లో ఉగ్రదాడి జరిగి ఏడు రోజులు అయినా మోదీ సర్కారు ఇప్పటి వరకు స్పందించలేదని విమర్శించారు. ఐదుగురు జవాన్లు సజీవదహనమైనా వారికి సంతాపం తెలుపుతూ ప్రధాని నరేంద్రమోదీ ఒక్క మాట మాట్లాడలేదని నిందించారు. పూంచ్ ఉగ్రదాడికి తాలిబాన్ సంబంధాలు ఉన్నట్లు వార్తలు వచ్చినా దానిని ఖండిస్తూ మోదీ ఒక్క మాట మాట్లాడలేదని ఖేరా చెప్పారు. ఉగ్రవాదులు స్టీల్ బుల్లెట్లు వాడినట్లు మీడియాలో పెద్దఎత్తున కథనాలు వచ్చాయని గుర్తుచేశారు. తాలిబాన్ ఉగ్రవాదుల నుంచి లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్ర సంస్థలు ఆ బుల్లెట్లు పొందినట్లు వార్తలు వచ్చాయన్నారు. ఇవి చైనా తయారీ స్టీల్ బుల్లెట్లు అని, వాటిని అఫ్ఘానిస్తాన్ యుద్ధకాలంలో నాటో బలగాలు ఉపయోగించినట్లు తెలుస్తోందని, ఆ బలగాలు అఫ్ఘానిస్తాన్‌లో స్టీల్ బుల్లెట్లను వదిలివెళ్లాయని ఖేరా వివరించారు. అఫ్ఘానిస్తాన్‌లో వదిలివెళ్లిన ఆయుధాలను ఆదాయం కోసం తాలిబాన్లు అమ్ముకున్నట్లు అమెరికా సిగర్(స్పెషల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఫర్ అఫ్ఘానిస్తాన్ రీకన్‌స్ట్రక్షన్) ఫిబ్రవరి 28న ఓ నివేదిక విడుదల చేసింది. అఫ్ఘాన్ జాతీయ భద్రతా బలగాల ఆయుధాలపై తాలిబాన్‌లకు ఇప్పటికీ పట్టు దొరకలేదని, అందువల్ల ఆయుధాలను బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు నివేదిక తెలిపిందని ఖేరా వివరించారు.

ఇది సిగ్గుచేటు...

కేజ్రీవాల్ ఇంటి సుందరీకరణకు రూ.45కోట్ల ఖర్చుపై కాంగ్రెస్

న్యూదిలీ: దిల్లీ ముఖ్యమంత్రి నివాసం సుందరీకరణ కోసం రూ.45కోట్లు ఖర్చు చేయడంపై కాంగ్రెస్ గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ని విమర్శించింది. ఇది సిగ్గుచేటు... పార్టీ తమ ఓటర్లకు చెంపదెబ్బ వేసినట్లుగా ఈ వైఖరి ఉన్నదని వ్యాఖ్యానించింది. ఓవైపు ఆమ్ ఆద్మీ పార్టీతో కలుస్తూ మరోవైపు అదే పార్టీపై విమర్శలు చేయడంపై ప్రశ్నలకు స్పందిస్తూ 'ఇక్కడ గుడ్ కాప్... బ్యాడ్ కాప్' లాంటిదేమీ లేదు.. రెండు పద్ధతులు ఉండవచ్చని కాంగ్రెస్ బదులిచ్చింది. కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ విమర్శలు చేస్తున్నారు... మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే... కేజ్రీవాల్‌తో ప్రతిపక్ష ఐక్యత గురించి చర్చలు జరుపుతున్నారని విలేకరులు ప్రశ్నిస్తే మాకెన్ వైఖరిని పార్టీ మీడియా శాఖాధిపతి పవన్ ఖేరా సమర్థించారు. 'మీరు ఆమ్ ఆద్మీ (సామాన్యుడు) అని చెప్పుకుంటారు కానీ మిమ్మల్ని ఎవరూ ఆమ్ ఆద్మీగా చూడటం లేదు. కోవిడ్ సమయంలో ప్రజలు ఇబ్బంది పడుతూ ఆక్సిజన్ కొరత ఏర్పడినప్పుడు మీరు చేసినదేమిటి? స్విమ్మింగ్ పూల్ కట్టించుకోవడం, కర్టెన్లు, టైల్స్ పెట్టించుకోవడమా! ఇందుకోసం కోట్ల రూపాయలు వెచ్చించడమా! ఇదేనా ఆమ్ ఆద్మీ ప్రభుత్వమంటే? అని ఖేరా విమర్శించారు. మాకు వాస్తవాలు తెలుసు కాబట్టి మీలో కొందరి వలే మేము ఆశ్చర్యపోలేదుగానీ నిజాయితీ, నిరాండబరత గురించి ఢంకా బజాయిస్తూ విలాసాలపై ఇంతలా వెచ్చించడం చూసి మేమూ విస్తుపోయాం. కేజ్రీవాల్ సమర్పించిన అఫిడవిట్ గురించి మాకెన్ ప్రస్తావించారు. అధికారిక నివాసంలో ఉండనని, అవసరానికి మించి భద్రత అక్కర్లేదని, ఎర్ర బుగ్గకారు అక్కర్లేదని ఆయన చెప్పడాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆయనకున్న భద్రతను చూశారా? ఎమ్మెల్యే కూడా సీఎం నివాసంలోకి ప్రవేశించలేరు. ఆయన నివాసానికి దగ్గరల్లోనే షీలా దీక్షిత్ ఇల్లు ఉంది. ఆమె సీఎంగా ఉన్నప్పుడు ఉదయం పూట సామాన్యులు వచ్చి ఆమెను అపాయింట్‌మెంట్ లేకుండా కలిసేవారు. ఎమ్మెల్యేలు, వర్కర్లు ఎప్పుడు కావాలంటే అప్పుడు వేళ్లేవారు. షీలా దీక్షిత్, ఆమె మంత్రుల ఇళ్లపై 15ఏళ్ల పాలనా కాలంలో ఖర్చుపెట్టిందని, ప్రస్తుత సీఎం ఇంటి సుందరీకరణకు వెచ్చించినది చూడండి. రూ.45 కోట్లు ఖర్చు చేయడం సిగ్గుచేటు. తమ ఓటర్లకు చెంపదెబ్బ కొట్టడంకంటే ఇదేమీ తక్కువ కాదు' అని ఖేరా వ్యాఖ్యానించారు.

బీహార్‌లో జైళ్ల సామర్థ్యం పెంపు

పాట్నా: బీహార్‌లోని జైళ్లు తమ సామర్థ్యాన్ని పెంచుకున్నాయి. ఇప్పటికే ఖైదీలతో కిక్కిరిసిపోతున్న క్రమంలో ఉన్న వారి కంటే రెట్టింపు లేదా అంతకంటే ఎక్కువ మందిని ఉంచే వీలుగా సామర్థ్యాన్ని పెంచుకున్నాయి. ఇటీవల 27 మంది ఖైదీలను విడుదల చేయడం రాష్ట్రంలో వివాదాస్పదంగా మారింది. తాజాగా రాష్ట్ర హోంశాఖ చూపిన గణాంకాల ప్రకారం 59 జైళ్ల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉన్నది. ఆయా జైళ్లలో దాదాపు 62వేల మంది ఖైదీలు ఉన్నారు. మార్చి 31 నాటికి ఎనిమిది సెంట్రల్ జైళ్లతో సహా 59 జైళ్లలో 47,750 మంది ఖైదీలు ఉన్నట్లు వెబ్‌సైట్‌లో హోంశాఖ పేర్కొంది. కానీ ఆయా జైళ్లలో 61,891 మంది ఖైదీలు ఉన్నారు. అంటే జైళ్ల సామర్థ్యం కంటే 30శాతం ఎక్కువగానే ఖైదీల సంఖ్య ఉంది. జమూయి జిల్లా జైలు పరిస్థితి దారుణంగా ఉంది. 188 మంది ఖైదీలకు సరిపోయే స్థలంలో 822 మంది కిక్కిరిసిపోయి ఉన్నారు. ఈ జైలుకున్న సామర్థ్యానికి నాలుగు రెట్లు అధికంగా ఖైదీలను అక్కడ నిర్బంధించారు. ఈ విధంగా మరో 38 జైళ్లు ఉన్నట్లు హోంశాఖ వర్గాలు పేర్కొన్నాయి. 14ఏళ్లకుపైగా శిక్షను పూర్తి చేసుకున్న ఖైదీల రెమిషన్‌కు అనుమతిచ్చే విషయంలోనూ ఇబ్బందులు తలెత్తడం, జైళ్ల నిర్వహణ సంస్కరణలు వంటి అంశాల దృష్ట్యా ఈ గణాంకాలు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. రాజకీయ నేతగా మారిన గ్యాంగ్‌స్టర్ ఆనంద్ మోహన్ సింగ్‌ను గురువారం సహర్సా జైలు నుంచి విడుదల చేయడంపై విమర్శలు వచ్చిన విషయం విదితమే.

11 రోజులు...42 ప్రాంతాలు

నేటి నుంచి దేవెగౌడ ప్రచారం

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరపున ప్రచారం చేయనున్నట్లు జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ గురువారం చెప్పారు. రానున్న 11 రోజుల్లో 42 ప్రాంతాల్లో ప్రచారం చేస్తానని తెలిపారు. ఆరోగ్య కారణాలతో వారంలో ఓ రోజు విశ్రాంతి తీసుకుంటానని చెప్పారు. 89 ఏళ్ల వయసులోనూ దేవెగౌడ ప్రచారం చేస్తున్నారు. 'రేపటి(శుక్రవారం) నుంచి నా ప్రచారం ప్రారంభమవుతుంది. మే 8వ తేదీ వరకు కొనసాగుతుంది. 42 ప్రాంతాల్లో ప్రచారం చేస్తాను. నేను వారానికి ఓసారి ఇంజెక్షన్ తీసుకోవాల్సి ఉంది. అందువల్ల వారానికి ఓసారి విరామం తీసుకుంటాను' అని దేవెగౌడ విలేకరుల సమావేశంలో చెప్పారు. జేడీఎస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తామని తెలంగాణ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖరరావు, మమతా బెనర్జీ హామీ ఇచ్చారని, తన కుమారుడు, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామితో కొంతమంది జాతీయ నాయకులు మాట్లాడుతున్నారని దేవెగౌడ చెప్పారు. రానున్న రోజుల్లో జాతీయ రాజకీయాల్లో అనేక పరిణామాలు చోటుచేసుకుంటాయని, స్థానికంగానే కొన్నిపరిణామాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అయితే ఆ పరిణామాలు వివరించడానికి ఆయన సుముఖత చూపలేదు. జేడీఎస్ తరఫున 211 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, అందులో ఇద్దరు ఉపసంహరించుకున్నారని, ఇద్దరి నామినేషన్లు తిరస్కరించారని, చివరికి 207 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు దేవెగౌడ వివరించారు. సీపీఎం అభ్యర్థులు ముగ్గురు, ఆర్‌పీఐ అభ్యర్థులు ముగ్గురికి తాము మద్దతిస్తున్నామన్నారు.

క్రిమినల్ కేసుల రికార్డులను డిజిటలీకరించాలి

జిల్లా కోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూదిల్లీ: అన్ని క్రిమినల్, సివిల్ కేసుల విచారణ రికార్డులు డిజిటల్ రూపేణ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి కోర్టులకు సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. క్రిమినల్ విచారణలు, వ్యాజ్యాల రికార్డుల డిజిటలీకరణ జరగాలని జిల్లా న్యాయస్థానాలకు ఆదేశాలిచ్చింది. డిజిటల్ రూపేణ రికార్డులను భద్రపర్చడానికి ఎస్‌ఓపీని 2021, సెప్టెంబరు 24న సుప్రీంకోర్టు ఈ-కమిటీ జారీచేయడాన్ని జస్టిస్ కృష్ణమురారీ, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. బాధ్యత, జవాబుదారీతనం ఉండే కచ్చితమైన వ్యవస్థ ఏర్పాటు కావాలని సూచించింది. న్యాయ ప్రక్రియ సజావుగా సాగేందుకుగాను అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం, తగిన విధంగా పరిరక్షించడం కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చింది. డిజిటలీకరణ తర్వాత రికార్డులన్నింటినీ ధ్రువీకరించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. సందర్భాన్ని బట్టి హైకోర్టులకు పీరియాడిక్ రిపోర్టులు పంపే వీలుగా డిజిటల్ రికార్డులు ఉండాలని సూచించింది. ఓ వ్యక్తికి అవినీతి కేసులో అలహాబాద్ హైకోర్టు విధించిన శిక్షను రద్దు చేసే క్రమంలో సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. ట్రయిల్ కోర్టులో రికార్డులు అందుబాటులో లేకపోవడంతో అప్పిలేట్ కోర్టు శిక్షను సమర్థిస్తూ జరిమానా మొత్తాన్ని పెంచింది.

28ఏళ్ల కిందట జరిగిన నేరానికి సంబంధించి ట్రయిల్ కోర్టు వద్ద సరైన ఆధారాలు లేకపోవడాన్ని గమనించిన సర్వోన్నత న్యాయస్థానం ఇకపై అన్ని క్రిమినల్, సివిల్ కేసులో విచారణల రికార్డులను డిజిటలీకరించాలని ఆదేశించింది.

91 ఎఫ్‌ఎం రేడియోల ప్రారంభం నేడు

న్యూదిల్లీ: దేశవ్యాప్తంగా 91 ఎఫ్‌ఎం రేడియో ట్రాన్స్‌మిటర్లను ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం ప్రారంభిస్తారు. సరిహద్దు ప్రాంతాలు, కోరుకున్న జిల్లాలకు ఎఫ్‌ఎం రేడియో కనెక్టివిటీని పెంచడం కోసం ఈ చర్యలు తీసుకుంటున్నారు. 18 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత రాష్ట్రాల్లో ఎఫ్‌ఎం రేడియో ట్రాన్స్‌మిటర్ల ప్రారంభిస్తున్నారు. కొత్తగా ప్రారంభించనున్న ఈ రేడియో సేవలు అదనంగా రెండు కోట్లమందికి చేరే అవకాశం ఉన్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. 35 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో ఎఫ్‌ఎం రేడియో సేవలు విస్తరిస్తాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ సహా 18 రాష్ట్రాల్లో ఎఫ్‌ఎం రేడియోలు విస్తరిస్తాయని తెలిపింది. ప్రజలకు మరింత చేరువ కావడంలో రేడియో పాత్ర అత్యంత కీలకమని ప్రధాని మోదీ బాగా విశ్వసిస్తున్నట్లు వెల్లడించింది.

ప్రమాదంలో రాజ్యాంగం

- మనుధర్మశాస్త్రం అమలుకు బీజేపీ కుట్ర
- రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి బదులు మనుధర్మశాస్త్రం అమలయ్యే ప్రమాదం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. 'బీజేపీని సాగనంపుదాం-దేశాన్ని కాపాడుకుందాం' నినాదంతో సీపీఐ, సీపీఎం అధ్వర్యాన చేపడుతున్న ప్రచారభేరిలో భాగంగా గురువారం సాయంత్రం ఒంగోలులో బహిరంగసభ జరిగింది. సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు వీవీఆర్ చౌదరి, రమేశ్ అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతపై మనపై ఉందన్నారు. ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని, ఆ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. దేశ సంపదను మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందన్నారు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలు జీవించే హక్కు కోల్పోతారన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి దాసోహమైందని, ఫలితంగా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా ఒక్క రోడ్డు వేసిన దాఖలాలు లేవన్నారు. కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు పారిపోతున్నాయన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని మార్చారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన సందర్భంలో కేంద్రం ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదన్నారు. విభజన హామీలపై ముఖ్యమంత్రి నోరు విప్పడం లేదని చెప్పారు. యర్రగొండపాలెంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు పర్యటనను మంత్రి ఆదిమూలపు సురేశ్ అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. కమ్యూనిస్టులు, ప్రజాతంత్రవాదులు, ప్రజలు పోరాటాలతో దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికే ప్రజలపై భారాలు పెరిగాయని, మోదీ, జగన్ తిరిగి అధికారంలోకి వస్తే ప్రజలు జీవించే పరిస్థితి ఉండదన్నారు. రోజురోజుకు పెట్రోలు, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని చెప్పారు. గ్యాస్ ధరలు పెరిగాయని, ధరలపై నియంత్రణ కనిపించడం లేదన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయన్నారు. ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి గఫూర్, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, జిల్లా నాయకులు ఎస్‌డీ సర్దార్, సీపీఎం రాష్ట్ర నాయకులు పూనాటి ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమర్శిస్తే దేశద్రోహులా?

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు: నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో దేశం ప్రమాదంలో పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సీపీఐ,సీపీఎం అధ్వర్యంలో జరుగుతున్న ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా గుంటూరు ఆటోనగర్‌లో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు చల్లా మరియదాసు అధ్యక్షతన గురువారం రాత్రి జరిగిన బహిరంగ సభలో జంగాల మాట్లాడుతూ ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసం దేశ సార్వభౌమాధికారాన్ని, స్వాతంత్ర్యాన్ని పణంగా పెట్టి పబ్బం గడుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ విధానాలను విమర్శించినా, పాలనలో లోపాలను ఎత్తిచూపినా దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన దేశభక్తులు ఎవరన్నది, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నది ఎవరన్నది ప్రజలు గ్రహించాలన్నారు. పారిశ్రామికరంగాన్ని ఉద్ధరిస్తానని ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, రాజధాని నిర్మాణానికి నిధులు, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్ తదితర హామీల విషయంలో మోదీ ప్రభుత్వం ఏపీకి తీరని ద్రోహం చేసిందని అన్నారు. ఈ నేపథ్యంలో మరో స్వాతంత్ర్య పోరాటానికి సమాయత్తం కావాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సీపీఐ నాయకులు ఆకిటి అరుణ్‌కుమార్, విజయ్‌కుమార్, మంగా శ్రీనివాస్, యశ్వంత్, సీపీఎం నాయకులు కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, ఎంఏ చిష్టి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై ప్రత్యక్ష పోరుకు సిద్ధం కండి

ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: తొమ్మిదేళ్ల పాలనలో నరేంద్ర మోదీ ప్రభుత్వం సామాన్యులపై భారాలు మోపుతూ ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తంచేశారు. విపరీతమైన పన్నుల భారం, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పేదవాడికి కనీసం తినడానికి తిండి లేని పరిస్థితుల్లో ప్రభుత్వం వ్యవహరిస్తోందనిన్నారు. మోదిని గద్దె దించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా గురువారం సీపీఐ జిల్లా నాయకులు రమేష్ బాబు ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలంలోని మండ్లెం, తంగడంచ, చాబోలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముపాళ్ల మాట్లాడుతూ స్థానిక సమస్యలపై అలుపెరుగని ప్రత్యక్ష పోరాటాలకు పార్టీ నాయకత్వం సిద్ధపడాలన్నారు. మండ్లెం గ్రామ రైతులకు సాగునీరు సాధనకు సీపీఐ ప్రత్యక్ష పోరుకు దిగుతుందని తెలిపారు. దేశంలో ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గ సమస్యలపై ఉధృత పోరుకు సిద్ధం కావాలన్నారు. శ్రీశైలం నీటి మునకలో సర్వస్వం కోల్పోయిన మండ్లం గ్రామ రైతుల పక్షాన ప్రతి ఎకరాకు కృష్ణ జలాలు అందించేంతవరకు పోరాడుతామన్నారు. చాబోలు గ్రామస్తులకు అధికారుల హామీ మేరకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురామ మూర్తి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధనంజయుడు,శ్రీనివాసులు, ఎర్రిస్వామి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శివయ్య, సీపీఐ మండల నాయకులు సురేశ్, నరసింహ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరేంద్ర, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం,రాష్ట్రం దొందూ దొందే

ఈశ్వరయ్య విమర్శ

విశాలాంధ్ర- విజయనగరం: అవినీతి అంతం...బీజేపీ పంతమన్న బీజేపీ చివరకు అవినీతికి పాల్పడేవారికి, ఆర్థిక నేరాలకు పాల్పడేవారికి కొమ్ముకాస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య విమర్శించారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన నీరవ్ మోదీ, లలిత్ మోదీ పై చర్యలు లేవని, దేశం నుంచి పారిపోయే అవకాశం కల్పించి వారి డబ్బుకు కాపలా వుంటున్నారన్నారు.గౌతమ్ ఆదానీ 12లక్షల కోట్ల అవినీతిపై పార్లమెంట లో మోదీ కనీసం పెదవి విప్పలేదని విమర్శించారు. "నన్ను నమ్మితే 75 లక్షల నల్లధనం వెలికి తీసి , పేదల అకౌంట్‌లో వేస్తాం" అన్న మోదీ మాటలు నీటిమూటలేనన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమలో భాగంగా విజయనగరంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఒమ్మి రమణ, తమ్మినేని సూర్యనారాయణ ఆధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజోపయోగ కార్యక్రమాలకంటే, ప్రజా వ్యతిరేక చర్యలే ఎక్కువని ఈశ్వరయ్య తెలిపారు. మోదీ, అమిత్ షా ద్వయం ప్రభుత్వరంగ సంస్థలను అమ్మితే ఆదాని వాటిని కొంటున్నాడన్నారు. ఎన్నో పోరాటాలు చేసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కమ్యూనిస్టులు సాధిస్తే, దాని నిధుల్లో కోత విధిస్తున్నారన్నారు. కేంద్రంపై పల్లెత్తు మాటనలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువల నిర్మాణం పనులు జరగడం లేదని, పోలవరం ప్రాజెక్ట్‌లో కదలిక లేదన్నారు. నాలుగేళ్ల పాటు భోగాపురం ఎయిర్ పోర్ట్ పై ఏం చేశారని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2014లో గ్యాస్ 450 రూపాయలుంటే బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1150 కి ధర పెరిగిందన్నారు. ధరల నిర్ణయాధికారం కేంద్రానిదేనని, పేద ప్రజలు ఇబ్బంది పడుతుంటే దేశాన్ని ప్రపంచపటంలో నిలబెడతానని మన్ కీ బాత్‌లో మోదీ చెపుతున్నారని విమర్శించారు. కేంద్రం నిర్ణయాలు ఆదానీ అంబానీలకు అనుకూలంగా వున్నాయన్నారు. ఈ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శి అశోక్, సీపీఎం జిల్లా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు తదితరులు మాట్లాడారు.

ఏసీబీ తనిఖీల్లో రూ.19 లక్షల స్వాధీనం

- అధికారులపై క్రిమినల్, శాఖాపరమైన చర్యలు
- డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వివిధ జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారుల బృందం రెండు రోజుల పాటు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో రూ.19లక్షల 28వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఏసీబీ 14400 కాల్ సెంటర్, ఏసీబీ యాప్‌కు వచ్చిన ఫిర్యాదులపై రెండు రోజుల పాటు రాష్ట్రంలోని వివిధ సబ్-రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల్లో మూకుమ్మడిగా ఏసీబీ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించిందన్నారు. ఏడు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు, రెండు తహసీల్దార్ కార్యాలయాల్లో తనిఖీల ద్వారా దాదాపు రూ.19లక్షల 28వేల అనధికార నగదును స్వాధీనం చేసుకున్నామని వివరించారు. బద్వేల్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం కడపలో నిర్వహించిన తనిఖీల్లో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ ఉద్యోగి నుంచి దాదాపు రూ.2లక్షల 70వేలు, డాక్యుమెంట్ రైటర్ నుంచి దాదాపు రూ.2లక్షల 10వేల నగదను జప్తు చేశారన్నారు. అనంతపురం, కందుకూరు, నెల్లూరుల్లోనూ తనిఖీలు కొనసాగాయని పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన తనిఖీల్లో డాక్యుమెంట్ రైటర్ నుంచి రూ.90వేలు, ఇద్దరు ప్రైవేట్ వ్యక్తుల నుంచి రూ.56వేలు, జూనియర్ అసిస్టెంట్ నుంచి రూ.9వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నర్సాపురం, ఏలూరు, విశాఖపట్నం, తుని, కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు గుంటూరు తహసీల్దార్ కార్యాలయంలో విస్తృతంగా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి సొమ్ముతోపాటు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదుపైన సంబంధిత అధికారులు, వ్యక్తులు ఇచ్చిన వివరణపై కారణాలను విశ్లేషించిన అనంతరం సబ్-రిజిస్ట్రార్లు, ఇతరులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుజ్జుల, దాసరి పోరాటాల స్ఫూర్తితో ముందుకు

వర్ధంతి సభలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతలైన అమరులు గుజ్జుల యల్లమందారెడ్డి, దాసరి నాగభూషణరావు పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మాజీ అధ్యక్షులు గుజ్జుల యల్లమందారెడ్డి 26వ వర్ధంతి, సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి దాసరి నాగభూషణరావు 15వ వర్ధంతి కార్యక్రమం ఇక్కడి సీపీఐ రాష్ట్ర కార్యాయలంలో గురువారం జరిగింది. పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో ఎనలేని చరిత్ర కలిగిన సీపీఐ అగ్రనాయకుల్లో ఈ ఇద్దరూ ఉన్నారని చెప్పారు. పెద్ద రైతు కుటుంబంలో జన్మించిన గుజ్జుల రాజకీయాల్లోకి వచ్చిన తరువాత వ్యవసాయ కార్మికుల కోసం పని చేశారని తెలిపారు. నిస్వార్థపరులుగా అట్టడుగువర్గాల సంఘానికి అధ్యక్షులుగా ఉన్నారని చెప్పారు. గుజ్జుల యల్లమందారెడ్డి భార్య, కుమారుడు కూడా కమ్యూనిస్టు పార్టీ కోసం పని చేశారని గుర్తు చేశారు. గుజ్జుల యల్లమందారెడ్డి శతజయంతిని ఈ సంవత్సరం రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో నిర్వహించబోతున్నట్లు చెప్పారు. దాసరి నాగభూషణరావు విద్యార్థి దశ నుంచి కడ వరకు సీపీఐ కోసం పని చేశారని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర కార్యదర్శి వరకు అంచెలంచెలుగా ఎదిగారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ భూపోరాటం జరిగినా ప్రత్యక్షంగా పాల్గొనే వారని చెప్పారు. ఈ నాయకుల స్ఫూర్తితో పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా వెంకటగిరి జమీందారీకి వ్యతిరేకంగా గుజ్జుల యల్లమందారెడ్డి పోరాడారని, కృష్ణాజిల్లా నూజివీడు జమీందారికి వ్యతిరేకంగా దాసరి నాగభూషణరావు పోరాడారని తెలిపారు. ఈ ఇద్దరు నేతలు జీవితం మొత్తం పేద ప్రజల కోసం, బడుగుజీవులకు సామాజిక న్యాయం కోసం పని చేశారని కొనియాడారు. 1970లో సీపీఐ, ఏఐటీయూసీ దేశ వ్యాప్తంగా భూ పోరాటాలు చేయాలని పిలుపునివ్వగా గుజ్జుల, దాసరి ఆ భూపోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని గుర్తు చేశారు. ముందుగా దాసరి నాగభూషణరావు చిత్రపటానికి రామకృష్ణ, గుజ్జుల యల్లమందారెడ్డి చిత్రపటానికి జల్లి విల్సన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య విప్లవ గేయాలు ఆలపించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు వై.చెంచయ్య, నెక్కంటి సుబ్బారావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రానాయక్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్నీడి యల్లమందరావు, సీపీఐ విజయవాడ, గుంటూరు నగర కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, కోట మాల్యాద్రి, ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం నాయకులు బుడ్డి రమేష్, సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు తాడిపైడియ్య, ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు కేఆర్ ఆంజనేయులు, మూలి సాంబశివరావు, మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల కార్మిక సంఘాల గుర్తింపు రద్దు నిర్ణయం వెనక్కి

ఏఐటీయూసీ డిమాండ్

న్యూఢిల్లీ: పోస్టల్ ఉద్యోగులకు సంబంధించిన రెండు ప్రధాన కార్మిక సంఘాల గుర్తింపును రద్దు చేయడం అప్రజాస్వామికమని ఏఐటీయూసీ పేర్కొంది. ఈ మేరకు పోస్టల్‌శాఖ ఉత్తర్వులు జారీచేయడాన్ని ఖండించింది. వీటిని ఉపసంహరించుకోవాలని గురువారం ఒక ప్రకటనలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ డిమాండ్ చేశారు. 70శాతానికిపైగా పోస్టల్ ఉద్యోగు లకు ప్రాతినిధ్యం వహించే కార్మిక సంఘాల గుర్తింపును రద్దు చేయడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ (ఎన్ఎఫ్‌పీఈ), ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ గుర్తింపును పునరుద్ధరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయంలో కార్మిక మంత్రికి, కమ్యూనికేషన్ శాఖ మంత్రికి లేఖలు పంపినట్లు వెల్లడించారు. కార్మిక సంఘాలపై జరిగే ఇటువంటి దాడులను తిప్పికొట్టాలని, ప్రతిఘటించాలని శ్రామికవర్గానికి పిలుపునిచ్చారు. ఎన్ఎఫ్‌పీటీఈ అధ్వర్యంలో పోస్టల్ ఉద్యోగులు చరిత్రాత్మక పోరాటాలు చేశారని, న్యాయమైన ట్రేడ్ యూనియన్ హక్కుల సాధన కోసం బ్రిటిష్ కాలం నుంచి పోరాడుతున్నట్లు వెల్లడించారు ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూపై ప్రత్యర్థి సంఘం చేసిన ఫిర్యాదు ఆధారంగా పోస్టల్‌శాఖ ఈ కఠిన నిర్ణయాన్ని తీసుకున్నదన్నారు. 'కిసాన్ ఉద్యమానికి, సీఐటీయూ, సీపీఎంకు చెందిన ఖాతాల్లో నుంచి ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ ఆర్థిక సాయం అందించినట్లు పోస్టల్ శాఖ పేర్కొంది. పోరాడుతున్న సోదరి సంఘాలకు, వివిధ రంగాల కార్మికులకు మద్దతు, సంఘీభావం, ఆర్థిక సాయాన్ని కార్మిక సంఘాలు అందించడం భారత్‌లో కొత్తేమీ కాదు. ఇది చట్ట వ్యతిరేకం కాదు. సంఘీభావ చర్యల్లో దురుద్దేశాలుండవు. కానీ ప్రభుత్వం ఇలా కక్షసాధింపు చర్యలకు పూనుకోవడం దురదృష్టకరం' అని అమర్‌జీత్ కౌర్ పేర్కొన్నారు. కేంద్ర కార్మిక సంఘంగా గుర్తింపు ఉన్న సీఐటీయూని రాజకీయ పార్టీగా ఎలా ముద్రవేస్తారని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలతో కార్మికుల గొంతు నొక్కేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.

వ్యవసాయోత్పత్తుల విక్రయాలకు మేలు చేసే

'ఇండ్ గ్యాప్ ధృవీకరణ'

ప్రారంభించిన జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వ్యవసాయోత్పత్తుల విక్రయాలకు మేలు చేసే ఇండ్ గ్యాప్ ధృవీకరణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గురువారం క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. గ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా రాష్ట్ర అన్నదాతలు కష్టపడి నాణ్యమైన ప్రమాణాలతో పండించిన పంట దిగుబడులను తమకు జారీ చేసిన ధృవీకరణ పత్రాల ఆధారంగా ప్రీమియం ధరకు వారికి నచ్చిన చోట దేశీయంగా మాత్రమే కాకుండా యూరప్, అమెరికాతో సహా వందకు పైగా దేశాలకు ఎగుమతి చేసుకునే వెసులుబాటును ఏపీ ప్రభుత్వం కల్పిస్తుంది. దేశ రైతులకు ఇచ్చే గ్యాప్ సర్టిఫికేషన్‌ను ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్‌గా ఇతర దేశాలు గుర్తిస్తాయి. రానున్న రోజుల్లో ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ ప్రమాణాలను గ్లోబల్ గ్యాప్ సర్టిఫికేషన్ ప్రమాణాలతో సరిసమానం చేయనున్నారు. అప్పుడు వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో వాణిజ్యపరమైన డిమాండ్ పెరుగుతుంది. దేశంలో మేలైన వ్యవసాయ పద్ధతులను బలోపేతం చేసే సదుద్దేశంతో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇండ్ గ్యాప్ ధృవీకరణ పథకాన్ని అభివృద్ధి చేసి పండ్లు, కూరగాయలు, సంయోగ పంటలు, తేయాకు, గ్రీన్ కాఫీ, సుగంధ ద్రవ్యాలు అనే ఐదు విభాగాలుగా ధృవీకరిస్తారు. ఈ ధృవీకరణను రైతులు, రైతు బృందాలతో చేయించవచ్చు. రాష్ట్రంలో ఇండ్ గ్యాప్ ధృవీకరణ పథకం కింద ఏపీఎస్‌వోపీసీఏ ధృవీకరణ సేవలు అందిస్తుంది. ఇండ్ గ్యాప్ ధృవీకరణ ఒప్పంద పత్రాలను సీఎం సమక్షంలో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ జక్షయ్ షా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మార్చుకున్నారు. జక్షయ్ షా, క్యూసీఐ డైరెక్టర్ డాక్టర్ మనీష్ పాండే, ఎఫ్ఏవో భారత్ ప్రతినిధి ఇన్‌చార్జి అధికారి డాక్టర్ కొండారెడ్డి చవ్వా, ఐసీఏఆర్-ఏటీఏఆర్ఐ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా, సీఎం ప్రత్యేక సీఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ సి.హరికిరణ్, ఏపీ సీడ్స్ వీసీ అండ్ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, ఏపీఎస్ఎస్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ త్రివిక్రమ్ రెడ్డి పాల్గొన్నారు.

బాదల్‌కు కన్నీటి వీడ్కోలు

బాదల్ (పంజాబ్): అకాలీ దళ్ సీనియర్ నాయకుడు ప్రకాశ్ సింగ్ బాదల్ అంత్య క్రియలు గురువారం పంజాబ్‌లోని ముక్త్సర్ జిల్లాలోని వారి పూర్వీకుల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. అంత్యక్రియల్లో వేలాది మంది అభిమానులు పాల్గొని తమ ప్రియతమ నాయకుడికి కన్నీటి వీడ్కోలు పలికారు. పంజాబ్ పోలీసులు గన్ సెల్యూట్ ఇవ్వగా ప్రకాశ్ సింగ్ బాదల్ చితికి తనయుడు, శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఏడీ) అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ నిప్పుపెట్టారు. చితి కాలుతున్నప్పుడు బాదల్ తనయుడు సుఖ్‌బీర్, తనయ పర్నీత్ కౌత్ కైరో భావోద్వేగానికి గురయ్యారు. సుఖ్‌బీర్ భార్య, కేంద్రమాజీ మంత్రి హర్సిమ్రత్ కౌర్ బాదల్, వీరి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కూడా పక్కనే ఉన్నారు. పంజాబ్ గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్, ముఖ్యమంత్రి భగవంత్ మాన్ శ్మశానవాటికకు వెళ్లి బాదల్ భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించారు. బాదల్ కొంత కాలంగా అనారోగ్యంతో ఉండగా ఈనెల 16న ఆయనను మొహాలీలోని ఫోర్టిస్ ఆసుపత్రిలో చేర్చారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడిన ఆయన ఆసుపత్రిలో చేర్చిన తొమ్మిది రోజుల తర్వాత అంటే మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఏడు దశాబ్దాలకుపైగా రాజకీయ జీవితం గడిపిన బాదల్‌కు రాజకీయ నాయకులు, మత గురువులు అంజలి ఘటించారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా, కేంద్రమంత్రులు హర్‌దీప్ సింగ్ పూర్తి, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ తదితరులు బాదల్ గ్రామాన్ని సందర్శించి నివాళులర్పించారు. హరియాణా మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా, కాంగ్రెస్ నేత దీపిందర్ హుడా, బీజేపీ పంజాబ్ అధ్యక్షుడు అశ్వినీశర్మ, కాంగ్రెస్ పంజాబ్ అధ్యక్షుడు అమరిందర్ సింగ్ రాజా వర్రింగ్, పంజాబ్ మాజీ మంత్రి సుఖ్‌జిందర్ సింగ్ రంధావా కూడా హాజరయ్యారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.